# మనసభలో జారిన ముత్యాలు




-'అరుణకాంత్'

జంటనగరాల గాలితెరలు మృదువుగా స్పృశించాయి.

బేగంపేట ఎయిరోడ్రోములో ప్లేను ఆగింది. వాలో ఉత్సాహం వరవళ్లు తొక్కుతూంది. ఎదురు చూస్తున్న పండగరోజు వచ్చినట్లుయింది. ప్లేను దిగుతూంటే నా చూపులు విజయ్ కోసం వెదుకుతున్నాయి.

రైలింగ్ వెనక డార్క్‌గ్రే ఉలెన్‌పాంటులో టకప్ చేసిన ఆవరంజి ఛాయ టెరిలిన్ షర్టులో, చక్కని పొంయిజ్‌తో, గ్రేస్‌ఫుల్‌గా, నిండుగా, దర్జాగా, ఠీవిగా' వీటుగా, ముచ్చటగా ఉన్నాడు. నిశితంగా చూస్తున్న కళ్లు, పొడుగైన కనుబొమ్మలతో, కోటేరులాంటి ముక్కుతో, పశ్చిమాద్రినుండి ఏటవాలుగా పడుతున్న సూర్యకిరణాల జల్లులో అతని పచ్చని మొహం మెరుస్తూంది.

నా మనసులో విచిత్రమైన భావసమ్మేళన సంగీతం ప్రతిధ్వనిస్తూంది. మా ఇద్దరి కుడిచేతులూ అభివందనలు తెల్పుకొన్నాయి. క్షణంలో అక్కడికి చేరుకొన్నాను. అప్రయత్నంగా కౌగిలించుకొన్నాం. ఆనంద పారవశ్యంలో మూగబోయాం ఇద్దరం, ఒక క్షణం.

"నీవు వస్తున్నావని ఇచ్చిన టెలిగ్రాం అందినప్పటి నుండి ఇప్పటిదాకా ప్రతి నిమిషం ఒక గంటలా గడిచింది." ఆప్యాయంగా, మృదువుగా అన్నాడు విజయ్.

"నాకు టికెట్ రిజర్వు అయినప్పటినుండి కాలం స్తంభించినట్లుయిందిరా!" అన్నాను. ప్రేమగా చూశాడు విజయ్. నా సూట్‌కేసు లగేజికౌంటరులోంచి తీసుకొని బయటకు నడిచాం. మూన్‌స్టోన్‌కలర్‌లో ఫియట్‌కారు మెరుస్తూంది. "డ్రైవ్ చేస్తావా" అని అడిగాడు.

"లేదు. ఊరు చూడాలి. నువ్వు నడుపు" అన్నాను.

ప్రాణస్నేహితుని పక్కన కూర్చుని ఆంధ్ర రాజధానిని తిలకిస్తూంటే, మది పులకించుతూంది. మా మధ్య అనేకమైన కబుర్లు పరుగెడుతున్నాయి. నిమిషాలు సెకండ్సుగా అనిపిస్తున్నాయి. థియరీ ఆఫ్ రిలెటివిటీ.

హిమాయత్‌నగర్‌లో ఒక అందమైన ఇంటి కాంపౌండులో ఆగింది కారు. ఫస్ట్ ఫ్లోర్‌కి విజయ్ వెనకాల వెళ్ళాను. ఇల్లు ఎంతో అందంగా, హుందాగా ఫర్నిష్ చేయబడింది.

స్నానాలయిన తరవాత డ్రెస్ చేసుకొని, డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాం, కబుర్లలో మునిగి. వంటచేసే కుర్రాడు కాఫీ ట్రే తెచ్చాడు.

కాఫీలయిన తరవాత సిటీలోకి బయలుదేరాం. హైదరాబాదు ఎంతో సుందరంగా, చైతన్యవంతంగా కనిపిస్తూంది. పాత జ్ఞాపకాలు పైకి వస్తున్నాయి. ఎంతో హోమ్లీగా ఫీల్ అయ్యాను.

టాంక్‌బండ్‌మీద కారుని ఆనుకొని నిలబడి కబుర్లు చెప్పుకొంటున్నాం.

"రేపొద్దున్న మద్రాసుకి వెళ్ళాలని టెలిగ్రాంలో ఇచ్చావు. అంత తొందరేమిటి" అని అడిగాడు విజయ్.

"ఏం చెయ్యమురా? పోలీస్ డిపార్టుమెంటువాడిని కదా? ఒక అర్జెంటు పనిమీద ఢిల్లీనుండి బొంబాయి వెళ్ళాను. అయితే ఆ పనికోసం అక్కడినుండి మద్రాసు కూడా వెళ్ళవలసి వచ్చింది. కొంతసేపైనా నీతో గడపాలని ఇక్కడికి వచ్చాను" అని అన్నాను.

"జేమ్స్ బాండ్‌వి అయ్యావన్న మాట!" పరిహాసంగా అన్నాడు విజయ్. నవ్వులలో పడ్డాం. ఆ రాత్రంతా కబుర్లు చెప్పుకోవాలనుకున్నాం, మర్నాడు విడిపోవాలి కాబట్టి.

ఇంటికి వచ్చి, భోజనం చేసిన తరవాత డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాం. టేప్‌రికార్డరు మధురమయిన పాటలు వినిపిస్తూంది. కొన్ని నెలల క్రితం విజయ్ నాకు వ్రాసిన ఉత్తరం జ్ఞాపకానికి వచ్చింది. అందులో తను, కొంతకాలం క్రితం ఒక విచిత్రమయిన పరిస్థితిలో మహనీయ ఔదార్యాన్ని చూడగలిగాడనీ, కాని తరవాత ఇంకొక జటిలమయిన సమస్య ఉత్పన్నమయిన దనీ వ్రాశాడు. వివరాలు వ్రాయలేదు. విజయ్‌ని ఆరాట పెట్టిన విషయాలు ఏమిటో? విజయ్‌ని అడిగాను.

"రవీ, నా విషయాలు నీకు కాకపోతే ఇంకెవ్వరికి చెప్పగలనురా? నువ్వు తప్ప ఇంకెవ్వరు అర్థం చేసుకో గలరు నన్ను? సరే, ఆ విషయాలు తరవాత చెపుతాను. ఈ వేళ నా ఫ్రెండొకాయన ట్రాన్స్‌ఫర్‌మీద ఇక్కడినుండి వెళ్ళిపోతున్నారు. సికిందరాబాదు స్టేషను కెళ్ళి 'గుడ్‌బై' చెప్పి ఒక్క గంటలో తిరిగివస్తా. అప్పటిదాకా నువ్వు రిలాక్సు అవు. నే వచ్చేవరకుస్మీ!" చిరునవ్వుల వెలుగులలో ప్రకాశిస్తున్న ఆకర్షణీయ మైన విజయ్ కేసి చూస్తూ, "గుడ్‌లక్" అన్నాను.

నాకు సుపరిచయమైన బూట్ల టకటక సంగీతంలా వినిపించింది. కారు స్టార్టు చేసిన చప్పుడు విన్నాను.

ఒకటి రెండు చినుకులు పడుతున్నట్లున్నాయి బయట. మెత్తని సోఫాలో జేరగిలబడ్డాను. మధురంగా సంగీతం వస్తూంది టేప్‌రికార్డరులోంచి. విజయ్ చుట్టూ నా ఆలోచనలు పరిభ్రమిస్తున్నాయి. ఉదాత్త మైన భావాల స్వరూపమే అతను. అనేకమంది విశిష్ట మైన వ్యక్తుల రచనలచే, జీవిత ఆదర్శాలచే ప్రభావిత మయిన విజయ్ న్యాయం, కరుణ, స్నేహం, మమతలని

సముద్రపు కెరటాలలో తేలియాడుతూంది నావ. కారుమేఘాల చీకటిలో దూరంగా కనుపిస్తున్న రమణీయమైన కాంతిరేఖ గమ్యమని సూచనగా సముద్రపు ఘోష పదేపదే పలుకుతూంది. ఈ ప్రయాణం ఎప్పుడు ఏమౌతుందోనన్న ఆందోళన, గమ్యం ఏమిటా అన్న నిరీక్షణ. జీవనజ్యోతి మిలమిలా మెరుస్తూ స్వాగత సంగీతం ఆలపిస్తూంది. సమీపించింది పడవ. సముద్రపు కెరటాలు ఉవ్వెత్తున లేచాయి. చుక్కానిని గట్టిగా పట్టుకున్నాయి చేతులు. ఉన్నతమైన ఆ జ్యోతి దగ్గరకు కెరటంపై లేవాలి పడవ. సముద్రుడు కరుణించినట్లు అయింది. ఒక కెరటం తిరిగి ఉవ్వెత్తున లేచింది. కాని......

ఆరాధించేవాడు. మా ఇద్దరికీ ఒకటే ఆకాంక్ష ఉండేది— ఎవరి చేతా వేలెత్తి చూపబడకూడదని.

స్కూలులో క్లాస్‌మేట్స్‌గా ఉండిన మేము, తరవాత చదువులకి వేరు వేరు యూనివర్సిటీలకి వెళ్ళవలసి వచ్చింది. నేను మద్రాసులో, సైకాలజీలో మాస్టర్సు డిగ్రీని తెచ్చుకొన్న టైముకి, విజయ్ బెనారస్‌లో ఎమ్. ఎస్‌సి. డిగ్రీ తెచ్చుకొన్నాడు. తరవాత హైదరాబాదులో లయజాన్ ఆఫీసరుగా జాయినయ్యాడు. విజయ్ ఇక్కడ ఉండడంవల్లనేమో నేను ఇక్కడికి వచ్చేశా రీసెర్చి కోసం అప్పుడు ప్రతి రోజూ. ఒక్క క్షణంలా, తియ్యగా, హాయిగా గడిచేది. మా భావాలు ఒకేలా ఉండేవి. మద్రాసులో నా మనసు దోచుకొన్న శాంతని గురించి నేను చెప్పేటప్పుడు విని ముచ్చట పడేవాడు. నా ప్రేమబంధానికి బలమిచ్చినది, ప్రోత్సాహమిచ్చినది విజయే. తరవాత నేను "ఐ. సి. ఎస్. లో సెలక్టవడం, మౌంట్ అబూకి ట్రెయినింగుకి వెళ్ళటం జరిగాయి. గంభీరుడయిన విజయ్ బాధపడడం నే వెళ్ళేరోజున మాత్రం చూశా. ఆ వేళ అన్నాడు విజయ్— "పార్టింగ్ ఈజ్ ఆల్వేస్ శాడ్" అని.

నేను చదువుకున్న సైకాలజీ నా ఉద్యోగంలో అక్కరకు వచ్చింది. నేను అవతలివారిని అంచనా వేయగలను. కాని విజయ్ అందర్నీ నోబుల్ అనుకుంటాడు, స్వతహాగా. ఇది వరమో, శాపమో చెప్పడం కష్టం. కాని, విచిత్ర మేమిటంటే, విజయ్ అవతలి వారి మనస్సులో, ఆ క్షణంలో ఉన్న భావాలను అద్భుతంగా పసికట్టగలడు. కాని క్షణ క్షణానికి మారే మనుషులు మరుక్షణంలో ఏం చేస్తారో అంచనా వేయలేడు. అతని హృదయం అతి సున్నితమైన సెంటిమెంట్సుకి స్థానమైతే, అతని మెదడు మాత్రం వజ్రసమానం. సమర్థుడు, స్ట్రెయిట్‌ఫార్వర్డ్ అని పేరు తెచ్చుకొన్నాడు. ఇతరుల మన్ననలని సులభంగా పొందుతాడు. ఎందరో యువతుల మనసులు, చూపులు విజయ్ చుట్టూ పరిభ్రమిస్తూంటాయని, వారి కళ్ళలో విజయ్ రూపు మెదులుతూ ఉంటుందని నాకు బాగా తెలుసు. విజయ్‌లో మృదుత్వం, నిర్మలత్వాల వెనక గంభీరత, ధీరత్వం ఉన్నాయి.

నా ట్రెయినింగ్ పూర్తయిన తరవాత ఢిల్లీలో నన్ను డెప్యూటీ సూపరింటెండెంటుగా పోస్టు చేశారు. ఆరు నెలల క్రితం, నేను కోరుకొన్న శాంతతో నా పెళ్ళి అయింది మద్రాసులో. విజయ్ పెళ్ళికి వచ్చి సందడి చేసి, "భగవంతుడు నీ కిచ్చిన అపురూపమైన కానుకరా శాంత" అన్నాడు. విజయ్ వెంటనే హైదరాబాదు వచ్చేశాడు. రేపటి నా రాక కోసం శాంత వెయిట్ చేస్తూ ఉంటుంది మద్రాసులో.

బయట వర్షం పడుతూంది.

తలుపులు తెరుచుకొన్నాయి. కుడిచేతిమీద రెయిన్ కోటు వేసుకొని చిరునవ్వుతో విజయ్ లోపలికి వచ్చాడు. చిలిపికళ్ళతో మెరుస్తున్న విజయ్ ముఖం కేసి చూసి నవ్వాను. చైతన్యం వచ్చినట్లయింది.

"సారీ. లేటయింది. టీ తాగుదామా" అన్నాడు విజయ్.

"టీ ఈజ్ వెల్‌కమ్" అన్నాను.

లోపలికెళ్ళి అయిదు నిమిషాలలో టీ చేసి తెచ్చాడు వంటచేసే అబ్బాయి.

టీ సిప్‌చేస్తూ, "విజయ్, నువ్వు చెపుతానన్న విషయాలను గురించి వినాలని ఎంత ఆత్రత పడుతున్నానో తెలుసా?" అన్నాను.

విజయ్ నా కేసి చూస్తూ అన్నాడు:

"రవీ, మనకు ఎంతో మంది వ్యక్తులతో పరిచయాలు, కాకతాళీయంగా కొన్ని, పెరుగుతాయి. ఆ పరిచయాలు సౌజన్యచిహ్నాలుగా ఉండిపోతే చాలు. కాని విధి అనేకసార్లు వెక్కిరిస్తుంది. సరే, అసలు సంగతులకి వస్తా. నువ్వు ఈ ఊరు వదిలి ఏణ్ణర్థంపైన అయింది. నాకు ఆఫీసులోను, బయట స్నేహితుల దగ్గర మంచి పేరు వచ్చింది. రోజులు శాంతంగా, ఆహ్లాదకరంగా గడుస్తున్నాయి. విభిన్న వ్యక్తులతో పరిచయాలను విధి వినోదంగా పెంచుతూంది.

ఒకనాడు రెసిడెన్సీబస్సుస్టాప్‌లో నించోవలసి వచ్చింది, సిటీబస్సు కోసం. క్యూలో నా పక్కన ఎవరో యువతి నించుని ఉంది. చేతిలో స్టెతస్కోప్, కాలేజీ రికార్డులు ఆమె మెడికో అని చెపుతున్నాయి. ఉన్నట్లుండి ఆమె చేతిలోని స్టెతస్కోప్ జారి నా కాళ్ళమీద పడింది. నేను వంగి తీస్తూంటే ఆమె 'సారీ!' అంది. 'నెవర్ మైండ్' అంటూ ఆమెకి తిరిగి ఇచ్చాను. మంచులో తడిసిన మందారపువ్వులా సన్నగా, నాజూగ్గా మెరుస్తున్న ఆమె 'థాంక్స్' అంది. నేను తల కిందకు వాల్చుతూ 'ఇటీజ్ ఆల్‌రైట్' అన్నా. సిటీబస్సు ఇంకా రాలేదు. ఇంతలో ఒక బిచ్చగత్తె ధర్మం చేయమని ప్రాధేయ పూర్వకంగా అడిగింది. నే నిచ్చిన డబ్బుతో వెళ్ళిపోకుండా 'బాబూ, అమ్మ చక్కగా లక్ష్మీదేవిలా ఉంది నీ పక్కన' అని మరీ వెళ్ళింది. ఈ ఆశ్చర్యకరమైన వ్యాఖ్యకి విస్మయం చెందాను. నా పక్కన నించున్న సుందరి సిగ్గుదొంతరలలో ముడుచుకుపోయింది. ఆమె ఏమనుకుంటుందో అని బాగా ఎంబరాస్ అయ్యాను. అదృష్ట వశాత్తు ఇంతలోకి బస్సు రావడం, ఆ విపరీత పరిస్థితి మొహమాటంలోంచి బయట పడడం జరిగాయి.

రెండు వారాల తరవాత నేను ఎగ్జిబిషన్‌కి వెళ్ళడం జరిగింది. అయితే ఒక చోట నేను నించుని ఉండటం,

నేను బస్సుస్టాప్‌లో చూసిన ఆమె నా ముందునించి వెళ్ళుతూ నన్ను గుర్తుపట్టినట్లుగా చూడడం జరిగాయి.

నేను ఒక స్నేహితుని ఇంట్లో జరిగిన గృహప్రవేశానికి వెళ్ళవలసి వచ్చింది. అతిథులలో కొంతమందికి పరిచయం చేయబడ్డాను. వారిలో శంకరశాస్త్రిగారని పేరు మోసిన డాక్టరు ఉన్నారు. ఆయన ఆప్యాయంగా నా పుట్టుపూర్వోత్తరాలు విచారించి, 'భలేవాడివే! మీ నాన్న, నేను క్లాసుమేట్సుం' అని సరదాగా కబుర్లు చెప్పారు. వచ్చే ఆదివారం సాయంత్రం నేను వారి ఇంటికి వెళ్ళాలని పట్టుబట్టారు. సరే నన్నాను.

ఆ ఆదివారం సాయంత్రం ఆయన ఇంటికి వెళ్ళాను. అధునాతనంగా కనిపిస్తున్న విశాలమైన భవంతి ముందు కాంపౌండులో విరబూచిన పూల మొక్కలు శిరఃకంపన చేస్తున్నాయి. లోపలి కెళ్ళడానికి గేటుమీద చేయి వేసినవాడిని అప్రతిభుడనయి అలాగే ఉండిపోయాను.

దేవలోకంలో నుంచి దిగివచ్చిన అప్సరసల్లా ఇద్దరు యువతులు నించుని మాట్లాడుకొంటున్నారు, పూల మొక్కలమధ్య. ఒకామె పూలదండని ఇంకొక ఆమె తలలో తురుముతూంది. విరబూచిన విరితోట నవజీవన చైతన్యప్రాంగణంలోని ఈ దృశ్యం అతి రమణీయంగా, మనోహరంగా ఉంది. బంగారపుఛాయలో మెరుస్తూ, తీర్చి దిద్దిన ముఖారవిందాలతో గలగల నవ్వుతూంటే, గాజుల రవళి శ్రుతి కలుపుతూంటే చూడముచ్చటగా ఉన్న సౌందర్యప్రదర్శనా అనిపించింది. ఆ అందాలని చూస్తుంటే విధాతని ప్రశంసచేయ బుద్ధయింది. చిరునవ్వుల చల్లని కాంతిపుంజాలు చిందిస్తున్న వాళ్ళ కళ్ళు ప్రకాశిస్తూంటే, కనురెప్పలు విసనకర్రల్లా ఆడుతున్నాయి.

ఇద్దరూ ఒకేలా లేకపోయినా, ఇద్దరిలోనూ, సౌందర్యం ఒకేలాగ ఉంది. సృష్టికి పరాకాష్ఠ.

నా తలలో స్విచ్ ఆన్ అయింది. ఎస్. ఒకరు కొద్ది రోజుల క్రితం బస్సుస్టాప్‌లో కనిపించిన మెడికో. ఇంతలో ఆమె నాకేసి చూసింది. ఆశ్చర్యంతోటి ఆమె కళ్ళు పెద్దవయ్యాయి. పక్కనే ఉన్నామెతో ఏదో చెప్పింది.

ఇద్దరూ నా కేసి చూశారు.

నేను 'డాక్టరుగారు ఉన్నారా' అని అడిగాను.

ఆ ఇద్దరిలోని, రెండవ ఆమె గేటు దగ్గరకు వచ్చి, 'లేరండి. ఇప్పుడు రావాలి' అంది.

'థాంక్స్. మళ్ళీ వస్తా'నని వెను తిరిగా.

'ఎక్స్‌క్యూజ్ మీ' అన్న మాటలు విని మళ్ళీ ఆ ఇంటికిఅభిముఖుడనయ్యాను.


'మీరు. . .' అర్థోక్తిలో ఆగిన ఆమె ప్రశ్నకి ఫలానా అని చెప్పాను.

'ఓ!' అని ఆశ్చర్యం సూచించి, 'నమస్కారం. మీరు వస్తారని మా ఫాదర్ చెప్పారు. లోపలికి రండి' అని ఆమె గేటు తెరిచింది.

ఆమెను అనుసరించాను, డ్రాయింగ్‌రూములోకి. కూర్చోమని సోఫా చూపించింది.

'నా పేరు ప్రతిమ. కాలేజీలో చదువుతున్నాను.' పక్కన ఉన్న సుందరిని గురించి, 'ఈమె మా బాబాయి గారి అమ్మాయి, కళ్యాణి. మెడిసిన్ చదువుతూంది' అని చెప్పింది. కళ్యాణి సిగ్గుతో నమస్కరించింది. వాళ్ళ పరిచయాలు కలిగినందుకు ఆనందిస్తున్నానని చెప్పాను.

ఇంతలోకి కారు చప్పుడయింది. శాస్త్రిగారు




లోపలికి వచ్చారు—'హల్లో' అంటూ. లేచి విష్ చేశా.

'యంగ్‌మాన్. అర్జెంటుగా ఒక పేషంటుని చూడడానికి వెళ్ళవలసి వచ్చింది. ఇంట్లో లేనందుకు నా అపాలజీ' అన్నారు ఆయన.

'ఫర్వాలేదండి. నేను ఇప్పుడే వచ్చా.'

ఆయన నవ్వి, 'కళ్యాణీ, ప్రతిమా! ఇతనెవరో తెలుసా? వండర్‌ఫుల్ యంగ్‌మాన్' అన్నారు.

'తెలుసు' అన్నారు ఇద్దరూ, చిరునవ్వులతో.

'కూర్చో. ఇప్పుడే వస్తా'నంటూ లోనికి వెళ్లి ఆయన తన అర్ధాంగిని తీసుకొని వచ్చారు.

'విజయ్, దిస్ లేడీఈజ్ మై బెటర్‌హాఫ్ అండ్ బాస్!' 'ఊరుకుందురూ' అన్నా రావిడ శాస్త్రిగారిని. అందరం నవ్వుల్లో తేలాం. నేను లేచి నించుని 'నమస్కారమండి' అన్నాను. 'కూర్చో, బాబూ' అన్నా రావిడ వాత్సల్యపూరితమైన కంఠంతో.

'మేడమ్, అపూర్వమైన గెస్టు వచ్చాడు మనింటికి' అన్నారు శాస్త్రిగారు. ఆవిడ చిరునవ్వుతో 'అవు' నన్నారు. అమ్మాయి లిద్దరూ మందస్మిత వదనులయ్యారు.

మేం కబుర్లలో పడ్డాం. పుస్తకాల దగ్గర నుండి రాజకీయాలదాకా అనేకమైన కబుర్లు చైతన్యవంతమైన వాతావరణంలో ఉల్లాసంగా దొర్లిపోయాయి.

తరవాత వాళ్ళ ఇల్లంతా చూపించి, డైనింగ్ టేబుల్ దగ్గిర కూర్చోబెట్టారు. నేను మొహమాటపడ్డా వారి ఆతిథ్యానికి లొంగిపోక తప్పలేదు.

ఆ కుటుంబంలోని మమతలు మధురంగా ఉన్నాయి. అంతా మంచితనంతోటి, ఉత్తమ సంస్కారంతోటి నిండి ఉన్నారు. అందరూ కలుపుకోరుమనుషులు. నేను సెలవు కోరాను. నన్ను సాగనంపుతూ శాస్త్రిగారు 'నిన్ను కలుసుకోవడం మా అందరికి ఎంతో సంతోషంగా ఉంది. యు మస్ట్‌విజిట్ అజ్‌ఫ్రీక్వెంట్లీ' అన్నారు. మిగతా సభ్యులంతా ఔనన్నట్లు తల లూపారు.

'మీ వంటి సహృదయులతో కాలక్షేపం చేసే అదృష్టం కలిగినందుకు ధన్యవాదాలు నేను చెప్పాలి' అని బయలుదేరాను, వాళ్లింటినుండి.

రోజులు దొర్లుతున్నాయి. నాకు ఇంకొకరి ఇంటికి పనిలేకుండా అస్తమానం వెళ్ళే అలవాటు లేదు, ఒక్క బాగా చనువున్న స్నేహితుల విషయంలో తప్ప. అయితే శాస్త్రిగారు నాలుగయిదు సార్లు ఇక్కడికి వచ్చి పిలిచిన తరవాత వెళ్లక తప్పలేదు. ప్రతిమ, కళ్యాణి ఎక్కడైనా చూడడం తటస్థిస్తే, వాళ్ళకి లిఫ్టు ఇస్తూండేవాడిని. చివరకు, నాకు కుటుంబంతో పరిచయం చనువుగా మారింది. వారి స్నేహభావం, చక్కని అంతఃకరణ నాకు ఆకుటుంబసభ్యుల ఎడల ఆత్మీయతని, గౌరవాన్ని పెంచుతున్నాయి. ప్రతిమ చక్కగా పాడుతుంది. కళ్యాణికి కూచిపూడి నృత్యంలో ప్రవేశముంది.

ఒకనాడు నా ఆఫీసుకి శాస్త్రిగారు టెలిఫోన్ చేశారు — వచ్చే శనివారం కళ్యాణి ప్రతిమల పుట్టిన రోజని, ఆ రోజు సాయంత్రం వాళ్ళింటికి నేను వెళ్ళాలని, ప్రజంటు ఏమీ ఇవ్వకూడదని. నేను ఆశ్చర్య పడుతూంటే, వాళ్లిద్దరూ ఒకే రోజున పుట్టారని, ఒకరంటే ఒకరికి ప్రాణమని చెప్పారు. విచిత్రమైన మధుర భావనలు కలిగాయి ఈ విషయం వింటుంటే. సరే నన్నాను.

మరునాడు శుక్రవారం నా కోసం టెలిఫోన్ వచ్చింది.

'మిస్టర్ విజయ్ ప్లీజ్!' అతి సుకుమారమయిన కంఠస్వరం.

'స్పీకింగ్.'

'గుడ్‌మార్నింగ్. ఎవరిని మాట్లాడుతున్నానో చెప్పగలరా?'

చిరునవ్వులు ధ్వనిస్తున్నాయి. ప్రతిమ.

'గుడ్‌మార్నింగ్. మీ కంఠస్వరం మృదువుగా మధురంగా ఉంది. మీరు గాయకులనుకొంటా.'

'ఏం కాదు. పోల్చుకోలేకపోతున్నారు.'

'చెప్పినా కాదంటున్నారు. ఏం చెయ్యను చెప్పండి?'

'ఊఁ ప్రతిమను మాట్లాడుతున్నా. రేపు కళ్యాణి

పుట్టినరోజు. మీరు రేపు సాయంత్రం జరిగే పార్టీకి విచ్చేయవలయునని ఆహ్వానం పలుకుతున్నాను.'

'కాదు. ఆహ్వానగీతం పాడుతున్నారు. సరే, కళ్యాణికి నన్ను పిలవడం ఇష్టం లేదేమో మరి — మీరు పిలుస్తున్నారు.'

'భలేవారే! మా ఇద్దరిలో ఎవరు పిలిచినా ఒకటే. మేం ఇద్దరం ఒకటే.' తన్మయత్వంతో చెబుతూంది.

'థాంక్స్. ఎక్కడినుండి మాట్లాడుతున్నారు?'

'కాలేజీనుండి. తప్పక వస్తారుకదూ. బై' అంటూ ఫోన్ పెట్టేసింది. అయితే తన పుట్టినరోజని చెప్ప లేదు. నవ్వుకొన్నాను.

ఆ సాయంత్రం కళ్యాణి ఫోన్ చేసింది.

'గుర్తున్నానా?'

'భలేవారే! ఆ ప్రశ్న నే నడుగుదామనుకొంటున్నా నండి, డాక్టర్!'

'నే నింకా డాక్టరును కాదండీ!'

'ఐ మీన్ కాబోయే డాక్టర్. అసలయిన రీసెర్చి డాక్టరేటు తెచ్చుకొనే. . .'

'అమ్మ బాబోయ్! మెడికల్ కోర్సు మహా సముద్ర మండి. ఇందులోంచి ఎప్పుడు బయటపడతానా అని చూస్తున్నాను. అసలు విషయం వినండి. రేపు ప్రతిమ పుట్టినరోజండి. సాయంత్రం పార్టీకి మీరు తక్కక రావాలి. రాకపోతే ఊరుకొనేది లేదు. వస్తారు కదూ?'

'ఊరుకోమంటున్నారు మరి. . .'

'థాంక్స్. మరిచిపోకండి.'

'కాని ఇంకేదో ఫంక్షనుకి వెళ్ళవలసి ఉన్నట్లు జ్ఞాపకమండి.'

'నో ఎక్స్‌క్యూజెస్ ప్లీజ్!'

'మీరు పిలుస్తున్నారు. మీ సిస్టరుకి నన్ను తన పుట్టినరోజుకి పిలవడం ఇష్టం లేదా?'

'భలేవారే! మా ఇద్దరిలో ఎవరు పిలిచినా ఒకటే. మేం సిస్టర్సు మాత్రమే కాదు, ప్రాణస్నేహితులం కూడా.' తన్మయత్వంతో చెపుతూంది.

'మీ ఆపేక్షలు వింటుంటే ఎంత మనోహరంగా ఉందో తెలుసా?'

'మెనీ థాంక్స్. మరిచిపోకండేం?'

'నేను మరిచిపోతే మీరు ఊరుకొంటారా? థాంక్సు ఫర్ది ఇన్విటేషన్' అని ఫోన్ పెట్టేశా.

ఆహ్వానాలు విచిత్రంగా, డ్రమెటిక్‌గా ఉన్నాయి.

మరునాడు సాయంత్రం వాళ్ళింటికి వెళ్ళాను. పరిసరాలు సందడిగా, అదో రకం సువాసనల మధురిమతో ఉల్లాసకరంగా ఉన్నాయి. శాస్త్రిగారు నన్ను చూసి ఎదురు వచ్చి ఆహ్వానించారు. ఆయన తమ్ముడు, మరదలు—అంటే కళ్యాణి తల్లిదండ్రులు ఢిల్లీనుండి వచ్చారని చెప్పి వాళ్ళను పిలిచి పరిచయం చేశారు. శాస్త్రిగారి కుటుంబంలాగే ఎంతో నిండుహృదయులుగా, సెన్స్ ఆఫ్ హ్యూమరు గల వ్యక్తుల్లా కనిపించారు. సరళంగా మాట్లాడారు వారు.

ప్రెండ్సుతో కబుర్లు చెపుతున్న ప్రతిమా, కళ్యాణీ నన్ను చూసి దగ్గరకు వచ్చారు, చిరునవ్వులతో నమస్కారమంటూ.

పసుపుచీరలో ప్రతిమ, ఎరుపుచీరలో కళ్యాణి శోభాయమానంగా, తమలో తామే కాదు, అందాల దేవతలతోనే పోటీ పడేటట్లుగా, ఆనందానికి ప్రతిరూపాలుగా, ఆహ్లాదానికి నిర్వచనాల్లా, నిర్మలత్వానికి ప్రతిబింబాల్లా, స్వచ్ఛంగా, మధురంగా, చూపరులను ముగ్ధులను చేసే అందాలతో మెరుస్తున్నారు.

నా మనస్సు మాట్లాడింది.

'మీ ఇద్దరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ రిద్దరూ పుట్టుకతోనే అపూర్వమైన బాంధవ్యాన్ని సృజించుకొన్నారు. చక్కని అంతఃకరణ, సంస్కారం, విద్య, రూపం వరాలుగా పొందారు. అంతకన్నా అపురూపమయిన స్నేహాన్ని మలుచుకొన్నారు. మీ ఇద్దరికి ఎప్పుడూ మంచే జరగాలని, మీ భవిష్యత్తు నందన వనంలోని మనోహరగీతంలా, వెలుగుచిమ్మే కాంతి రేఖలా, సుస్మితంగా, సుతారంగా, సుగంధ పరిమళాలతో నిండాలని స్నేహితుడుగా మనఃపూర్తిగా కోరుతున్నాను.'

ఇద్దరి కాటుక కళ్ళు ఆర్ద్రతతో చెమర్చాయి.

'మీ మంచి మనసుకి కృతజ్ఞత ఎలా చెప్పగలం?'

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన శివపార్వతీ విగ్రహాలు ఇద్దరికీ ఇచ్చాను.

వారి కృతజ్ఞతను ఆపమని చెప్పి, 'మీ ఇద్దరికీ జాయింటుగా ఒక ప్రజంటు తెచ్చాను' అన్నాను.

## యౌవనం

యౌవనం అనేది అత్యద్భుత సంపద. దానిని పిల్లలను కని, పెంచడంలో వృథా చేయడం మహా నేరం.

—జి. బి. షా

'ఇంకానా?'

'అవును. ఒక సంగీతమమతా స్వరూపాన్ని దాశరథి గారు వ్రాస్తే చెలి పుట్టినరోజున అన్ని అందాలు ఇమ్మని సుశీల పాడిన పాట. అతి మనోహరమైన గ్రామఫోన్ రికార్డు. మీ ఇద్దరి పుట్టినరోజుకి ఇంతకన్న మంచి వస్తువు నాకు కనిపించలేదు. రికార్డు ప్లే చెయ్యండి.'

'సుపెర్బ్!' అంది కళ్యాణి.

'మధురమైన పాట' అంది ప్రతిమ.

'కాని తరవాత మీ పాట వినిపించాలి' అన్నా.

'ప్రతిమ పాడుతుందండి. చక్కగా మనం విందామండి' అంది కళ్యాణి.

'పోవే' అంటూ ప్రతిమ ఆ గ్రామఫోన్ రికార్డుని ప్లేచేసింది.

ఆ పాటలోని భావసముదాయపు చైతన్యం ఆర్ద్రత మార్మోగింది.

ఫలహారాలు ముగిసిన తరవాత ప్రతిమని పాట పాడమని అంతా కోరారు. తప్పించుకొందామని ప్రయత్నించిన ప్రతిమ చివరికి పాట పాడడానికి ఒప్పుకోక తప్పలేదు.

అమరమైన జయదేవుని అష్టపదిని, వసంతకాల ఆగమనంతో మైమరిచి పాడే కోయిల కంఠస్వరంతో గళమెత్తి వీనులవిందు చేసింది ప్రతిమ.

ఆ పాట సుందరత్వానికి, ఆమె గానమాధుర్యలహరికి శ్రోతలంతా నిశ్చేష్టులమయ్యాం.

నయనాలు కాంచని ఏవో దివ్యలోకాలు, ఆ పాటలోని మధుర ప్రమిదకాంతులలో సాక్షాత్కరించాయి.

శంఖంలాటి ఆమె కంఠసీమనుండి వెలువడిన సంగీత మాధుర్యస్రవంతిలోని సొగస్సు కాలాన్ని బంధించి, ఆ పాటలోని లలితభావాలను లలిత లలితంగాచేసి, కర్పూర హారతి సుగంధాలతో, ఆత్మస్వరూపానికి నివాళులిచ్చినట్లయింది.

పాట ముగిసిన తరవాత శ్రోతలమంతా నిశ్శబ్ద సమాధిలోంచి రావడానికి కొన్ని క్షణాలు పట్టింది.

శ్రోతల అభినందన పరంపరలతో ప్రతిమ సిగ్గుతో కళ్యాణి చేతులలో ముడుచుకుపోయింది.

అంతా సెలవు తీసుకుని వెళ్ళిపోతున్నారు. నేనుకూడా బయలుదేరుదామని శాస్త్రిగారిని సెలవు కోరాను.

ఆయన 'నో నో. భోజనం చేస్తేగాని వెళ్ళడానికి వీల్లే'దన్నారు. ప్రతిమ, కళ్యాణి ఇద్దరూ వంత పాడారు. కాని నేను ఒప్పుకోలేదు.

'ఏమండీ, మా ఇంట్లో భోజనం చెయ్యడానికి అంత సందేహమెందుకండీ? మేం అన్నంలో విషం కలపమండీ' అని కళ్యాణి గోముగా అంది.

నవ్వు ఆపుకోలేకపోయా. 'ఫర్వాలేదు. మీరు నేర్చుకుంటున్నది మెడిసిన్ కదా' అన్నా.

ప్రతిమకేసి చూస్తూ, 'మీ పాటతో కడుపు నిండిపోయిందండి' అన్నా.

శాస్త్రిగారు 'కనీసం కాసేపు కూర్చుని తరవాత వెళుదువుకాని' అన్నారు.

అంతా లోకాభిరామాయణంలో పడ్డాం. కళ్యాణి తలిదండ్రులు ఎంతో సరదా అయిన వ్యక్తులు. వారి మాటల్లో సునిశితమైన హాస్యం పన్నీటిజల్లులా కురిసింది. కళ్యాణి అందరికీ కాఫీ ఇచ్చింది. సెలవు తీసుకొని వచ్చేశా, నా హృదయంనిండా ఆనందం నింపుకొని.

రోజులు తిరుగుతున్నాయి. ఒకనాటి ఉదయం ఇక్కడకు వచ్చారు శాస్త్రిగారు. ఆయనని ఆహ్వానించాను. కాసేపు సరదాగా కబుర్లు చెప్పి, 'నీతో పని ఉండి వచ్చానయ్యా' అన్నారు కాఫీ సిప్ చేస్తూ.

'చెప్పండి'.

'నీ సంస్కారంపై నాకు కాన్ఫిడెన్సు ఉంది. నన్ను తప్పుగా భావించవని అనుకుంటా.'

'నెవర్. మీరు ఏ విషయాన్నైనా చెప్పండి.'

'ప్రతిమ నాకు ఒక్కతే కూతురు. కళ్యాణి నా తమ్ముడి కూతురయినా నా చేతులమీదుగా పెరిగింది. అక్కచెల్లెళ్ళ బాంధవ్యమేగాక వాళ్ళిద్దరూ ప్రాణ స్నేహితులు. వ్యక్తిగత సంస్కారంలో, చదువులో నేను పెట్టుకొన్న ఆశలకి నిలిచారు.'

'డెఫినెట్లీ' అన్నా.

'మా ఆవిడ, నా మరదలు కళ్యాణి, ప్రతిమల పెళ్ళిళ్ళు సాధ్యమైనంత త్వరలో జరగాలని పట్టుపడుతున్నారు. వరుల కోసం వెదకడం మొదలెట్టాం. మా ఇంట్లో అందరికి నువ్వంటే చక్కని అభిప్రాయముంది. సరే, కళ్యాణి, ప్రతిమ లిద్దరూ నాకు రెండు కళ్ళు. వాళ్ళిద్దరిలో నువ్వు ఇష్టపడ్డ వారిని నీ కిచ్చి వివాహం చెయ్యాలని మా పెద్దవాళ్ళందరి మనసుల్లోను ఉంది. నీ నిర్ణయం ఆలోచించి చెప్పు. తరవాత మీ నాన్నతో మాట్లాడుతా.'

ఆయన మళ్ళీ— 'నువ్వు నన్ను అపార్థం చేసుకోవనుకొంటా. ఇందుకోసం నీ పరిచయం పెంచుకొన్నానని అనుకోకు. నీ నిర్ణయం ఎలా ఉన్నా నేను గౌరవిస్తా' అంటూ లేచారు.

'నో నో. ఐ విల్ నెవర్ మిస్టేక్ యూ. మీ మీద నా కెంతో గౌరవం ఉంది' అంటూ ఆయనతో మెట్లు దిగా.

ఆయన చిరునవ్వుతో తన కారులో కూర్చున్నారు.

'ఈ విషయం ఏమైనా మన స్నేహానికి అవరోధం కాదని విశ్వసిస్తున్నా' అన్నా.

ఆయన నా చేయి నొక్కి, 'నెవర్. వస్తా' నంటూ బయలుదేరారు.

నేను విభ్రాంతుడిని కాలేదు. ఏమంటే ఇటువంటి పరిస్థితిని చాలా సార్లు ఎదుర్కొన్నా. కాని బాగా పరిచయం ఉన్న వ్యక్తుల ప్రస్తావన ఉన్నందువల్ల విస్మయం చెందాను కొద్దిగా. రాబోయే నిర్ణయం నాకు చూచాయగా తెలుసనిపించింది. అయినా వితర్కించుకోవాలి.

నాలో వెంటనే పెళ్లి చేసుకొనేందుకు ఆత్రత లేదు. నా లోని చైతన్యం, భావస్రవంతి రూపాంతరం కావడం నే నిష్టపడలేను. నేను నమ్మిన ఆశయాల విలువల కోసం నిలబడాలి. బహుశా, బంధాలకి, ప్రలోభానికి దూరంగా ఉండాలనే ఆంతర్య అభిలాష నాలో బలమవుతూంది.

మంచితనం, మర్యాద, మమతలని పంచి ఇవ్వడానికి ప్రయత్నిస్తాను కాని,పుట్టుకతోనే మానవునిజీవితాంతం వెంటాడే స్వార్థపుఛాయలు నాకు దూరంగా ఉంచుతాను. వైవాహిక వ్యవస్థలో పవిత్రత, కొద్దిగా త్యాగం ఉన్నా ఆ బంధం స్వార్థపునీడలోనే పెరుగుతుందనిపించింది.

జీవనపరిధి బంధింపబడకూడదు.

హిమబిందువు స్వచ్ఛతలో నుండి దూసుకుపోయే భానుని కిరణం హరివిల్లులా ఎలా విరిసి మెరుస్తుందో నా జీవితం కరుణతో స్పందించి సౌకుమార్యంగా విరియాలి. ప్రత్యూష పవనంలోని నిర్మలత్వం పరిభ్రమించాలి.

ప్రశ్నలమయమయిన ఈ జీవితాన్ని పరిశీలకుడుగా, వ్యాఖ్యాతగా ధాటీగా, ధీరత్వంతో, హుందాగా గడపాలి.

జీవితంలో అమరమైనవి సంగీతం, సాహిత్యం. పరిపూర్ణమైన శాంతి వాటివల్లనే కలుగుతుంది. ఏ విధమయిన ప్రత్యుపకారం, కనీసం కృతజ్ఞతనైనా ఆశించకుండా, ఇతరులకి సహాయపడడంలోనే నిజమయిన ఆనందం ఉంది.

నా లోని భావాల పరాకాష్ఠ వివాహమని తలపోయలేకపోయాను. కళ్యాణి, ప్రతిమల రూపాలు నా ముందు మెదులుతున్నాయి. ఒకవేళ వారిద్దరిలో ఒకరిని వరించినా, ఇంకొకరిని నిరాకరించి నొప్పించానన్న భావం నాలో రాదా అని నన్ను నేను ప్రశ్నించుకొన్నాను.

ఈ ఆలోచనలు డాంబికంగా కనుపించినా సత్య దూరం మాత్రం కావు.

నాకు ఒక నెల సెలవు గ్రాంటయినట్లు కమ్యూనికేషను వచ్చింది అదే రోజున. అర్జెంటుగా చూడవలసిన ఆఫీసుపనులు ముగించే కార్యక్రమంలో ఉన్నాను.

ఆ మరుసటి రోజు సాయంత్రం ఆఫీసులో బిజీగా ఉన్నప్పుడు కళ్యాణి ఫోన్ చేసింది. కొద్దిగా ఆశ్చర్య పడ్డాను. 'బాగున్నారా?' అని అడిగింది.

'అలాగే అనిపిస్తుంది. మరి మీరు.''

'ఊఁ మీతో పని వచ్చి ఫోన్ చేశా.' ఆమె కంఠం కొద్దిగా కంపిస్తున్నట్లుంది.

'చెప్పండి.' అనునయంగా అన్నా.

'నేను చెప్పే విషయం మా ఇంట్లో ఎవరికీ చెప్పరు కదూ?' 'ప్రామిస్!'

'నిన్న మా పెదనాన్న మీ దగ్గరకు వచ్చారు. నా పేరుకూడా ప్రపోజ్ చేశారని విని బాధ పడ్డా. ఈ విషయంలో నేను హెల్ప్‌లెస్. కాబట్టి మీరు హెల్ప్ చెయ్యాలి. నా పేరుని మీరు తిరస్కరించాలి. ఇంకా...'

ఆమె గొంతుక బొంగురుపోతూంది.

'చెప్పండి. ఫర్వాలేదు' అన్నాను.

'మా ప్రతిమకి మీ రంటే ఎంతో అభిమానం. దాని అభిమానానికి మీరు తగ్గవారు.' నా గుండె ఝల్లుమన్నది.

నా తల తిరగబోతున్నట్లయింది. నిలదొక్కుకుని, 'మీకు వేరే ఏదైనా విషయంలో నా అసిస్టెన్సు కావలిసివస్తే నిస్సంకోచంగా అడగండి, ఎప్పుడైనా సరే' అని ప్రశాంతంగా అడగడానికి ప్రయత్నించాను.

'థాంక్స్. ప్రస్తుతానికి నే చెప్పిన విషయం. . .'

'గుర్తుంచుకుంటాను.'

మళ్లీ ధన్యవాదాలు చెప్పి డిస్‌కనెక్టు చేసింది.

నేను మెల్లిగా చిక్కుల్లో పడుతున్నా ననిపించింది.

అయితే ఆఫీసుపనిలో ఉన్నప్పుడు ఏ ఆలోచనలు నన్ను బాధించవు.

ఆ సాయంత్రం ఇంటికి వస్తూంటే మెదడులోని సంచలనం కెరటాల తాకిడి నన్ను వేధించింది.

ఇంటికి వచ్చి స్నానం చేసి, కాఫీ తాగి ఆఫీసుకి బయలు దేరాను, కొంత పని ముగించుదామని. పైగా ఆలోచనల వ్యథనుండి కొంతసేపైనా తప్పించుకోవచ్చు.

ట్రాఫిక్ రద్దీగా ఉంది. కారు ఆపమని ఎవరో సంజ్ఞ చేశారు. సడన్‌బ్రేకుతో ఆపి వెనక్కి చూశా. ప్రతిమ.

---

> చీకటిలోనే తారకలు కనిపిస్తాయి. అలాగే విచారంలోనే సత్యాలు దర్శనమిస్తాయి.
>
> —బెయిలీ

---

కారు దగ్గరకు సమీపించింది.

'హలో, గుడ్‌ఈవెనింగ్ టు యూ. రండి. ఎక్కడికి వెళ్లాలో చెప్పండి డ్రాప్ చేస్తాను.'

ఆమె వచ్చి కూర్చుంది. కారు సెకండుగేరులో మెల్లిగా కదులుతూంది.

'ఎక్కడికి పోనివ్వమంటారు?' మెల్లిగా అడిగా. సంధ్యాకాంతులలో ఆమె విరాజిల్లుతూంది. కొద్దిగా సీరియస్‌గా ఉన్నట్లనిపించింది ఆమె.

'మీతో కొంచెం మాట్లాడాలి. ఏదైనా రెస్టారెంటుకి వెళదాం, పదండి.'

'ష్యూర్' అంటూ ఆబిడ్స్‌కి మళ్లాం.

మౌనంగా ఉన్న ఆమెను మాటల్లో పెట్టాలని— 'ఏం సినిమాలు చూశారు ఈ మధ్య?' అని అడిగాను. ఆమె నా వైపు చూస్తూంది.

జవాబు లేదు. పరధ్యానంగా ఉన్నట్లుంది.

క్వాలిటీ రెస్టారెంటులోకి వెళ్లాం.

ఏం తీసుకుంటారని అడిగా. ఆమె ఏమీ వద్దంది. బేరర్‌కి రెండు కాఫీలు తెమ్మని చెప్పా.

ఆమె ముఖంపై ఒకటి రెండు నల్లటి ముంగురులు నాట్యం చేస్తున్నాయి. మనోహరమైన వెన్నెలచే పరివేష్టింపబడిన దేవతలా ఉంది ఆమె.

సుందర భావనల సుందర స్వరూపం.

కాఫీ సిప్ చేస్తున్నాం. ఆమె మెల్లిగా చిరునవ్వుతో అంది: 'మీరు మా ఇంటికి రావడానికి పూర్వం కళ్యాణి మిమ్మల్ని రెసిడెన్సీ బస్సుస్టాండులో చూసింది. మీకు జ్ఞాపకం ఉందా?' ఆమె కళ్లలో కొంటెతనం ప్రస్ఫుటమవుతూంది.

దిగ్భ్రాంతి చెందిన నేను తల ఊపుతూ—''అవును. ఆ రోజు నా కారు సర్వీసింగులో ఉంది'' అన్నాను.

నా సంజాయిషీ కోసం కాదేమో నన్నట్లు ఆమె మందహాసం చేసింది, ముత్యాలు రాలుతున్నట్లు.

టేబుల్‌మీద ఉన్న షుగర్‌పాట్‌ని చేతో సుతారంగా తిప్పుతూ పంచదారవైపు చూస్తూ, 'మా ఫాదర్ నిన్న మీ దగ్గరకి వచ్చారు. మ్యారేజి ప్రపోజల్స్ గురించి మాట్లాడారు' అంది.

మృదుమంజుల వీణానాదంలా ఆమె మాట్లాడుతూంది.

నేను షుగర్‌పాట్‌వైపు చూస్తున్నాను.

'ఈ విషయంలో నే నొక ప్రాబ్లెమ్‌లో చిక్కుకున్నాను.'

ఆమె మాటలు అర్థం అవుతున్నాయి.

'మీరు ఒక సహాయం చెయ్యాలి.' ఆమె మాటలలో ఆవేదన స్ఫురిస్తూంది.

'చెప్పండి' అన్నాను.

రాబోయే సన్నివేశం ఎలా ఉంటుందో!

'మా ఫాదర్ చేసిన ప్రపోజల్స్‌లోంచి నన్ను మీరు తిరస్కరించాలి. కళ్యాణికి మీ రంటే ఎంతో అభిమానం, అనురాగం ఉన్నాయి. ఆమె ఆశలకి మీరు అండగా నిలవాలి.'

విస్మయంలో మునిగాను. ఆమె మళ్లీ అంది:

'మీరు పరిస్థితిని అర్థం చేసుకుంటారని అనుకొంటున్నాను.'

ఆమె మాటలు కొద్దిగా తొట్రుపడుతున్నాయి.

నేను తల ఊపగలిగాను. నా మనసు జలదరించింది.

'ఈ విషయాలను మా ఇంట్లో ఎవ్వరికీ. . .'

ఆమె అర్ధోక్తిలో ఆగింది.

'చెప్పను.' అప్రయత్నంగా అనేశాను.

ఆమె సమస్యల తోరణాన్ని మెడలో ధరించినట్లుగా కనుపించింది. ఆమె కళ్లు చెమర్చబోతున్నాయి.

దేవతలే కంట తడిపెట్టుకొంటున్నారేమో!

చేతిరుమాలుతో ఆమె కళ్లు తుడవాలనిపించింది. కాని చెయ్యలేను.

నా కోసం ఏదో మానసిక కల్లోలం ఎదురుచూస్తున్నట్లనిపించింది.

నిండు హృదయంతో అన్నాను:

'మీరు చూపిన స్నేహానికి, సౌజన్యానికి నేను ఎలా కృతజ్ఞత చెప్పగలను? మంచితనం, పాలలాంటి మనస్సు గల మీ స్నేహం నాకు కలకాలం పూలసౌరభంలా గుర్తుంటుంది. మీకు నేను చేయగలిగిన సహాయం ఏదైనా ఉంటే, ఇప్పుడేకాదు, ఎప్పుడైనా సరే డిమాండ్ చెయ్యండి.'

'థాంక్స్. ఇతరులలోని మంచితనమే మీకు కనుపిస్తుంది. మీది అపురూపమయిన మనసని మా అందరికీ తెలుసు.' ఆమె మెల్లిగా అంది.

నేను తల వంచుకొన్నాను.

'పదండి, వెళదాం.' ఆమె అంది. నేను వెంటనే సీటులోంచి లేవలేకపోయాను. ఆమె వెనకాలే నడిచా. బయట చీకటి.

కారులో కూర్చున్నాం. 'ఎక్కడి కెళ్లాలో చెప్పండి' అనగలిగాను.

'కోఠీలో డ్రాప్ చెయ్యండి.

ఆమె కబుర్లు చెపుతూంది. నేను వింటున్నాను. కోఠీలో ఆమెను దింపి నే నాఫీసుకి వెళ్లాను.

(సశేషం)

(క్రిందటి సంచిక తరువాయి)

ఇంటికి తిరిగివచ్చిన నేను, నా పరిస్థితి సమీక్షించుకొన్నాను. కళ్యాణి, ప్రతిమల మాటలు, అంతకు పూర్వం నే ననుకొన్న నిర్ణయం పదే పదే ప్రతిధ్వనిస్తున్నాయి. ఒకరి కోసం ఇంకొకరు తమని కాన్సెల్ చేసుకొన్నారు.

నేను చేసుకొన్న నిర్ణయానికి ఇంకొక విధంగా నరిపోయింది.

కాని, ఇతరుల కోసం త్యాగం చెయ్యడం అనే వరాన్ని కథలలో, సినిమాలలో చూడగలిగిన నేను, ప్రత్యక్ష ప్రేక్షకుడనయి కంపించాను. నిస్స్వార్థ వ్యక్తుల సున్నితమయిన మనస్సుల సౌజన్యానికి, మమకారాలను ప్రోసిరాజనలేని నేను కరిగి, వేదనలోంచి ఏ సమాధిలోకో దారి వెతుక్కుంటూ జారిపోతున్నానేమో ననిపించింది.

శాస్త్రిగారికి నా నిర్ణయం ఎలా చెప్పగలను? చెప్పగలిగినా ఆయన ఆశాభంగాన్ని ఎలా చూడగలను? ఫోన్‌లో చెప్పినా ఆయన మాటలని, లేకపోతే మౌనాన్ని ఎలా వినగలను?

చివరికి, నాకు పెళ్లి ఇప్పుడు చేసుకునే అభిప్రాయం లేదని, నన్ను అన్యథా భావించరని ఆశిస్తున్నానని, ప్రతిమ, కళ్యాణి దేవతలవంటివారని, వాళ్ల వివాహాలు అత్యున్నతమైన వ్యక్తులతో జరగాలని, వాళ్ల జీవితాలలో నందనవనాలు పూయాలని, సౌజన్యపూరితులయిన ఆ అపురూప వ్యక్తులకు ఎల్లప్పుడూ జయం కలగాలని నా కంటే ఎక్కువగా కోరే వ్యక్తు లుండరని, నేను ఆయనకు ఆశాభంగం కలిగిస్తే క్షమించమని, నా వలన ఏదైనా అవసరముంటే ఆజ్ఞాపించమని, ఆయన సౌజన్యానికి అనర్హుడు కాబోనని ఆశిస్తున్నానని శాస్త్రి గారికి ఉత్తరం వ్రాశాను.

మరునాడు ఉదయం భారంగా ఆ ఉత్తరం అబిడ్స్‌లో పోస్టు చేశాను.

హృదయం నిశ్శబ్దంగా ఉంది. ఆ నిశ్శబ్దంలో ఏదో క్షోభ నిబిడీకృతమయినట్లుగా ఉంది. కారు మెల్లిగా నడుపుతున్నాను.

ఆశ్చర్యం. కనిపిస్తున్న బస్సుస్టాప్‌లో కళ్యాణి.

సన్నగా, విద్యుల్లతలా, కడిగిన ముత్యంలా, ప్రకాశింపజేసే కాంతిజ్యోతిలా, అందానికి నిర్వచనంలా, పాటకి పల్లవిలా, బంగారపుబొమ్మలా, కళాకారుడు జీవితమంతా తపస్సు చేసి తయారుచేసిన శిల్పంలా, పరిమళాలు వెదజల్లి విజయాన్ని ప్రసాదించే దేవతలా, మల్లెల మాలగా, వెన్నెల రేఖలా శోభిస్తున్నది.

నా మనసు ప్రఫుల్లమయింది. నా హృదయం భారమైంది. కారు ఆమెముందు ఆగింది. మందస్మితవదన అయి, నాట్యమయూరిలా కారు దగ్గరకు వచ్చింది. ఆమెకు నడక రాదు, సుందర నాట్యం తప్ప.

'గుడ్‌మార్నింగ్' అంది ఆమె.

'సేమ్ టూ యూ, యంగ్ లేడీ. మీ రన్నట్లు ఈవేళటి ఉదయం చాలా మంచిదై ఉండాలి. మీ దర్శన భాగ్యం కలిగింది. రండి' అంటూ కారు తలుపు తెరిచా.

'ఎక్కడినుండి వస్తున్నారు?' అని అడిగింది, కాటుక కన్ల తళుకులతో చూస్తూ.

'తెలియదు.' మెల్లిగా అన్నా.

ఆమె నవ్వి, 'ఎక్కడికో?' అంది.

'ఏమో?' అన్నాను. ఆమె కిలకిలమంది.

మళ్లీ 'మీరు చెప్పినచోటుకి. డైరెక్టు చెయ్యండి' అన్నాను.

'మా ఇంటికి పోనివ్వండి.'

'విత్ ప్లెజర్!'

ఆమె కనుకొనలనుండి చూస్తూంది. మాట్లాడడానికి ప్రయత్నిస్తూందో లేక నా మాటల కోసం ఎదురు చూస్తూందో! ఆమె అంది: 'మీకు. . .'

'చెప్పండి.'

'నిన్న ఫోన్‌లో చెప్పిన విషయం గుర్తుందికదూ?'

తల ఊపాను.

'మీరు నన్ను అపార్థం చేసుకోరుకదూ?' ఆమె అడిగింది.

ఆమెని ఎంబరాస్ చేస్తానేమోనని ఆమెకేసి చూడలేక పోయాను. రేర్‌వ్యూ మిర్రర్‌లోని ఆమె ప్రతిబింబం కేసి చూశాను.

నయనాల అంచులదాకా పాకి, ఆమె సుందరవదనంపై శోభిస్తున్న కాటుకరేఖలు ఆమె కళ్లు చమర్చబోతున్నాయని చెపుతున్నాయి. భగవంతుడికి మనుషుల మనసులతో వినోదించడం ఎంత ఇష్టం!

నేను కరిగిపోతున్నా. నన్ను నేనే నిభాయించుకొని,

---

జరిగిన కథ

**రవికి తన ప్రేమగాథ నివేదిస్తున్నాడు మిత్రుడు విజయ్...కళ్యాణి, ప్రతిమలకు సన్నిహితుడయ్యాడు విజయ్. ఇద్దరూ అతణ్ణి ప్రేమించారు. ఆ ఇద్దరిలో ఎవరినో ఒకరిని వివాహమాడమని శాస్త్రిగారు ప్రతిపాదించారు. కళ్యాణి, ప్రతిమ ఒండొరులకు తెలియకుండా ఒండొరుల క్షేమంకొరకు తమ ప్రేమ త్యాగం చేయడానికి నిశ్చయించారు. వారి వైఖరి విజయ్‌ని పరీక్షకు గురి చేసింది.**

---

'లేదు. మీరు దేవతవంటివారు' అని పూరణ విశ్వాసంతో అన్నాను.

'కాదు. ప్రతిమ. దేవత. మీ ఔన్నత్యానికి...'

ఆమె చెప్పబోయేది తెలుసు. వినలేను.

హారన్ గట్టిగా మోగించాను. ఆమె ఊహాలు చెదిరాయి.

'మీరు ఇద్దరూ దేవతలే' అన్నాను.

వాళ్లిద్దరిమధ్యా సెలయేరులా పొంగి పారలిన రాగబంధానికి హర్ష పులకాంకితుడనయ్యాను.

కారు ఆమె ఇంటిముందు ఆపాను.

'థాంక్స్. లోపలికి రండి.'

'లేదు వెళతా' నన్నాను. లోపలికి వెళ్లలేనని తెలుసు.

ఆమె కళ్లలో సంతోషం, ఇంకొక్క క్షణంలో ఏదో దిగులు దాగుడుమూతలాడుతున్నాయా అనిపించింది.

'విష్ యూ ది బెస్ట్, ఓన్లీ ది వెరీ బెస్ట్ ఆఫ్ లక్' అంటూ బయలుదేరా.

కళ్యాణి, ప్రతిమల మహనీయ ఔదార్యం చూసి మనసులోనే అంజలి ఘటించి, ధన్యుడనయ్యాను.

మరునాటి ఉదయం శాస్త్రిగారు ఇక్కడికి వచ్చారు. ఆయన్ను ఆహ్వానించి బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవలసిందిగా కోరాను. ఆయన ఎప్పటిలాగా చిరునవ్వు నవ్వుతున్నారు. నేనే వెంటనే మాట్లాడలేకపోతున్నా ననిపించింది. చివరికి ఆయన నా భుజంమీద చేయివేసి, 'నీ ఉత్తరం అందింది. నీ ఫ్రాంక్‌నెస్ నచ్చింది. నీవు ఫీల్ అవుతున్నా వనుకొంటున్నాను. టేకిట్ ఈజీ!' అన్నారు. ఆయన మంచితనానికి కరిగిపోయాను. నేను తల ఊపి, 'థాంక్స్. మిమ్మల్ని నొప్పించలే దనుకొంటాను' అన్నాను.

'నెవర్!' అన్నారు కాఫీ తాగుతూ. 'కాని, నువ్వు మా ఇంటికి వస్తూ ఉండాలి. నాకు కొడుకులు లేని లోటు తీరుతుంది నిన్ను చూస్తుంటే.' నేను ఆయన మంచితనానికి కృతజ్ఞత చెప్పుతూ, నేను లీవ్‌మీద మన ఊరుకి వెళ్లే విషయం చెప్పాను. కాసేపు కబుర్లు చెప్పి ఆయన వెళ్లారు.

సెలవుమీద మన ఊరు వెళ్లాను. పేరెంట్సు నన్ను పెళ్లి చేసుకోమని చాలా బలవంతం చేశారు. ఇప్పుడిప్పుడే కాదని తప్పించుకొన్నాను. అస్తమానూ ఎవరో పెద్దమనుషులు ఇంటికి రావటం, నన్ను చూడాలనడం, తరవాత పెళ్లి సంబంధాల ప్రసక్తి తేవడం చూసి విసుగెత్తిపోయింది. బంధువులంతా ఎన్ని సంబంధాలొస్తున్నాయో అనడం ఇంకా విసుగు కలిగించింది.

మూడు వారాలు ఇంటిదగ్గర ఉన్నాను.

తరవాత ఒక క్లాసుమేటు పెళ్లికి మద్రాసు కారుమీద ప్రయాణ మయ్యాను.

మద్రాసులో ఉన్నప్పుడు, ఒక రోజు మధ్యాహ్నం మహాబలిపురం చూడడానికి వెళ్లాను. ఆ రోజు మబ్బుగా ఉంది.

కారు టైరు పంక్చరు అయితే, బస్సుస్టాండు దగ్గర ఉన్న షాపులో రిపేరు కిచ్చి పచార్లు చేస్తున్నాను. బస్సుస్టాండు దగ్గిర ఎర్రని చీరలో, పచ్చగా ఉన్న ఒక అమ్మాయిని చూడడం సంభవించింది. ఎవరో తెలుసున్న వ్యక్తి అనిపించింది. అప్పుడే బస్సులో వచ్చి ఉండాలి. ఆమె కళ్లు నా కేసి ఆశ్చర్యకరంగా చూడడం, నేను అక్కడనుండి నా కారు దగ్గరకి కదిలిపోవడం జరిగాయి.

ఒకగంట తరవాత లైట్‌హౌస్ చూడడానికి వెళ్లాను. మెట్లు ఎక్కుతున్నాను ఏదో ఆలోచనాస్రవంతిలో మునిగి. ఎదురుగుండా మెట్లు దిగుతూంది అంత క్రితం నేను బస్సుస్టాండు దగ్గిర చూసిన అమ్మాయి. ఎవరో అనిపించింది. ఆమెకూడా అదేమాదిరి ఆశ్చర్యంలో ఉన్నట్లనిపించింది.

పైకి మెట్లు ఎక్కుతూ ఉంటే, అకస్మాత్తుగా వెనక్కి చూడాలనిపించింది. వెనక్కి తిరిగి చూశా. ఆమె కొన్ని మెట్లకింద నుండి పైకి చూస్తూంది. నేను వెనక్కి తిరగటంవల్లనేమో ఆమె మరోవైపు తిరిగి మెట్లు దిగుతూంది.

ఒక గంట తరవాత బీచికని బయలుదేరాను. ఆ రోజు సెలవురోజు కాకపోవటంవల్లనేమో జనం అట్టే మంది లేరు. ఇసుకలో కూర్చున్నాను.

ఏభై గజాల దూరంలో, సముద్రుని కెరటాల పరిష్వంగన పరవశంలో కిలకిలమంటూ ఇద్దరమ్మాయిలు ఆనందంతో వెల్లివిరుస్తున్నారు. పెద్ద కెరటం వస్తే వెనక్కి పరుగుపందెం వెయ్యడం, కెరటం వేగాన్ని అధిగమించలేకపోవటం, కాళ్లకింద ఇసుక కదిలిపోతే ఒకరి నొకరు భయంగా పట్టుకొని వినోదించడం కనిపిస్తూంది. జనానికి దూరంగా ఉండడంవల్లనేమో వాళ్లంత స్వేచ్ఛగా, హాయిగా ఉన్నారు, ఆనంద తరంగాలలో.

దూరంగా కనుపించే ఓడలు బొమ్మలలాగ ఉన్నాయి. ఆకాశపుటంచులతో కలుస్తున్నట్లు భ్రమింపచేసే నీటి పరిమాణంతో బంగాళాఖాతం 'నా గుండె ఎంత లోతో

# మంచుసంధ్యలో జారిన ముత్యాలు



-'అరుణకాంత్'


తెలుసా' అని పవనుడికి సంభ్రమం కలుగజేస్తున్నట్లుంది. ఒడ్డు దగ్గిర, పసుపులలాగే, చిలిపిగా ఎగిరెగిరి పడుతూ, మధ్య లోతైన గుండెలో, గాంభీర్యం దాచుకొన్నాడు సముద్రుడు అనిపిస్తూంది.

ఆకాశంలోని మబ్బుతునకలు నీటితుంపర కురిపించే ప్రయత్నంలో ఉన్నాయి. బీచిలో ఉన్న బహు కొద్ది మంది వెనక్కి మరలుతున్నారు. వీటిలో ఆటలు చాలించి ఆ ఇద్దరమ్మాయిలుకూడా నా పక్కనుండి వెళుతున్నారు. వారిద్దరిలో ఒకామె, నేను కొంతసేపటి కింద చూసిన అమ్మాయే. నా వైపు రవంత ఆశ్చర్య జనితమయిన నయనవీక్షణ ఆమెలో కనిపించింది.

నాలో ఆశ్చర్యం కలిగింది. ఏ బంధువు లింట్లోనో చూసినట్లనిపించింది. ఎక్కడ? గుర్తు రావడం లేదు.

వర్షం చెదిరిపోయింది. బహుశా ఇంత నీటిమీద తన ప్రభావం ఉండదని కాబోలు వరుణుడు నిష్క్ర మించాడు. బహుశా మూడు గంటలయి ఉంటుం దప్పుడు. ఆ క్రితం రోజు నా వాచీ ఎక్కడో పడి పోయింది. ఇంకొక అరగంటసేపు కూర్చుని లేచాము, మిగతా ప్రదేశాలను చూద్దామని. దూరంగా పడి ఉన్న

ప్రసిద్ధి చెందిన భారత్ వారి పేము కుర్చీలు
ప్రతి ఇంటా, ఆఫీసులో
తప్పక ఉండవలసినవి



శ్రీ జయభారతం అండ్ కం., (రిజిష్టర్డు)
132, ఆర్. హెచ్. రోడ్డు, మద్రాసు-14.
ఆర్డరుతో 50% అడ్వాన్సు తప్పక పంపవలెను. ముఖ్యమైన అన్నిటౌన్లలోను మాకు స్టాకిస్టులు కావలెను. ఉచిత కేటలాగుకు 25 పైసల పోస్టేజి స్టాంపు పంపుచు, మీ అడ్రసు స్పష్టంగా తెల్పుచు వ్రాయండి.

వాయిదాల మీద
ట్రాన్సిస్టర్



బిన్నీ మాస్టర్
3 బాండ్సు అఖిల ప్రపంచ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ (గ్యారంటీతో) నెలసరి రు. 10/-ల వాయిదా చెల్లుబడిమీద లభిస్తున్నది. ప్రతి పల్లెకు, బస్తీకి పంపవచ్చును. వెల రు. 165/-.

VISHAL AGENCIES (57),
P.B. 2100, Delhi-7




ఏదో వస్తువు నా చూపుల నాకర్షించింది. వెళ్ళిచూస్తే, అది లేడీస్ హాండ్ బాగ్. చుట్టుపక్కల అంతా నిర్మానుష్యంగా ఉంది. స్వంతదారు వివరాల కోసం బాగ్‌లోపల చూస్తే ఒక డైరీ, పెన్ను, చిన్న టాయిలెట్ బాక్సు, సుమారు రెండువందల రూపాయలదాకా డబ్బు ఉన్నాయి. అడ్రెసు కోసం డైరీ చూశాను. 'మిస్ సరోజ' అని ఉంది. కేరాఫ్ అడ్రెసుఉంది. ఓ! ఈమెది హైదరాబాదు.

బహుశా అంతకుపూర్వం ఇక్కడ సీటిలో అలరించిన ఇద్దరమ్మాయిలలో ఒకరిదై ఉండవచ్చు. కారు గ్లోవ్ బాక్సులో బాగ్‌ని పెట్టి, బస్సుస్టాండుకి వెళ్లాను కారులో. ఊహుఁ. అక్కడ లేరు. సరే, ఇంకా రెండు మూడు చోట్ల చూసి కనుపించకపోతే పోలీస్ స్టేషనులో సరెండర్ చేద్దామనుకొన్నాను. మిగతా టూరిస్ట్ ఇంటరెస్టింగ్ స్పాట్స్ చూడడానికి బయలుదేరాను. కొన్ని చోట్ల ఫోటోలు తీశాను.

పాండవుల రథం దగ్గరకు వచ్చాను. ఎవరూ లేరక్కడ. ఒక ఫోటో తీశాను. ఆంగిల్ సరిగ్గా కుదరలేదు. ఇంకొక ఫోటో తీద్దామని ప్రయత్నించాను. కొంతసేపటికి వ్యూఫైండర్‌లోకి చూస్తూ, ఆంగిల్ సెట్ చేయగలిగాను. క్లిక్ మనిపించడమే తరువాయి.

వ్యూఫైండర్‌లో అకస్మాత్తుగా కనుపించిన దృశ్యానికి అప్రతిభుడనయ్యాను. నేను ఎవరికోసం వెదుకుతున్నానో ఆమే! అంతకు పూర్వం మూడుసార్లు కనిపించిన అమ్మాయే. బహుశా ఈమెదే ఆ బాగ్ అయి ఉండవచ్చు. మందస్మిత వదనంలోని కాటుక కళ్ల సొగసుతో ఆమె సుందరరూపం కనిపిస్తోంది. ఇతరుల ఇష్టం లేనిదే వారి ఫోటోలు తియ్యడం నా ప్రిన్సిపుల్ కాదు. ఫోటో తీసే ప్రయత్నం విరమించుకొన్నాను.

ఆమె దగ్గరికి వెళ్ళి 'ఫర్‌గివ్ మి' అన్నాను.

విస్మయంగా చూసింది నా కేసి. ఆమె నయనాలు ఆశ్చర్యకరంగా పెద్దవయ్యాయి. సుందరత్వానికి ప్రతినిధిలా ఉంది. లావణ్య వైభవం ఆమెలో విరాజిల్లుతూంది. చకిత హరిణేక్షణ అనిపించింది.

'హావ్ యూ లాస్ట్ యువర్ హాండ్ బాగ్?' అని అడిగాను.

నే రడగడం మరిచిపోయాను!

ఆమె చుట్టుపక్కల కంగారుగా చూసి, 'నిర్మలా! నా బాగ్ ఎక్కడ?' అంది.

ఆ రెండవ అమ్మాయిపేరు నిర్మల అయి ఉండాలి.

ఆమె- 'ఎక్కడ వదిలేశావు, సరూ?' అంది. ఇద్దరూ కంగారులో పడ్డారు. మళ్లీ జ్ఞాపకం వచ్చినట్లుంది.

'మీరు చూశారా?' అని నా కేసి చూస్తూ అడిగింది, సరూ అని పిలువబడ్డ అమ్మాయి.

తల ఊపుతూ, 'బీచ్‌లో ఎవరో వదిలేసిన హాండ్ బాగ్ దొరికింది. అది మీది అయి ఉండవచ్చు' అన్నాను.

ఆమె నా చేతులకేసి చూసింది. నా చేతులలో కెమేరా మాత్రం ఉంది.

ఆమె కళ్ళు మిలమిలలాడుతున్నాయి.

'ఎక్కడ ఉందండీ?'

'రండి, చూపిస్తా.'

'బీచ్‌లో ఉందా ఇప్పుడు?' ఆమె ప్రశ్నకి నవ్వు వచ్చింది.

''లేదులెండి' అన్నాను.

కలిసి కారు దగ్గరికి నడిచాం ముగ్గురం. లాక్ తెరిచి బాగ్ చూపించాను ఆమెకి.

'చూడండి. మీదేనా?'

ఆ బాగ్ తనదేనని, నేను చేసిన సహాయానికి కృతజ్ఞత ఎలా చెప్పాలో తెలియడంలేదని అన్నది.

'మీది ఏ ఊరండి?' అని సంశయంగా అడిగింది.

మీ ఊరే అని అందామనుకొని, 'హైదరాబాదులో ఉంటున్నాను. అంటే ఈ రోజున కాదు సుమండీ' అన్నాను.

వాళ్లిద్దరూ నవ్వారు. ఆమె 'మీదే మా ఊరే నన్న మాట' అన్నది. 'మరి మీ పేరు చెప్పలేదు' అన్నాను.

'సరోజ. మరి మీ పేరు? ఏం చేస్తుంటారు?'

జవాబు చెప్పాను. తిరిగి ఆమెని అదే ప్రశ్న అడిగాను.

తనతోబాటు ఉన్నది తన స్నేహితురాలు నిర్మల అని, తామిద్దరూ హైదరాబాదులో బి. ఎ. లిటరేచర్ చదువుతున్నామని, మద్రాసులో తమ బంధువులింట్లో వివాహానికి వచ్చి, మహాబలిపురం చూడాలని వచ్చామని చెప్పింది సరోజ.

మళ్లీ ఆమె— 'మీకు కృతజ్ఞత ఎలా చెప్పాలో తెలియడం లేదు. మీరు చూడకపోతే నా బాగ్ దొరికేది కాదు' అన్నది.

'నేను కాకపోతే ఇంకొకరు చూసి ఇచ్చేవారు' అన్నాను.

'ఉయ్ ఆర్ ఇన్‌డెటెడ్ టు యూ. మీరు మాతో కాఫీ తీసుకోవాలి' అని అన్నది సరోజ. ఎంతో సిన్సియర్‌గా ఉంది ఆమె కంఠస్వరం. నిర్మలకూడా అవే మాటలు అంది.

'థాంక్స్. ఇందాకా మీరు బాగ్ ఓపెన్ చేసినప్పుడు నాకు భయం వేసింది' అన్నాను.

'ఎందుచేత?' అని విస్మయంగా అడిగింది సరోజ. ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. రాజీవలోచన.

'మీ బాగ్ తెచ్చి ఇచ్చినందుకు ఒక అయిదు రూపాయల నోటు నా చేతిలో పెడతారేమో నని భయపడ్డాను.' జోక్ చేస్తూ అన్నాను.

వాళ్ళిద్దరూ నవ్వులలో మునిగారు.

సరోజ నవ్వు వాపుకుంటూ 'భలేవారే!' అంది.

'కాఫీ తాగుదాం, రండి' అంటూ వాళ్ళనిద్దరినీ ఆహ్వానించాను.

కారులోని పుస్తకాలను చూస్తూ సరోజ 'మీ కారు మొబైల్ లైబ్రరీలా ఉంది' అన్నది నవ్వుతూ.

కారులో ఉన్న జూలియస్ సీజర్ వెరిటీ ఎడిషన్ చూస్తోంది.

'మీరు మొబైల్ రీడింగ్ రూమ్ అనుకుంటున్నారు' అన్నాను నవ్వుతూ.

సరోజ నవ్వి, 'మీకు 'సీజర్' నాటకం బాగా ఇష్టంలా ఉంది' అన్నది. అవు నన్నాను.

'ఎందుచేత? ఆ డ్రామానిండా హత్యలు, ఆత్మహత్యలు కదా ఉంట?' అని ఉత్సుకతతో ప్రశ్నించింది.

'అవును. అయినా ఆ డ్రామాలోని బ్రూటస్ కారెక్టర్ని అతి హృద్యంగా, అతి మనోహరంగా సృష్టించాడు షేక్స్పియర్. మాగ్నానిమిటీ, రెక్టిట్యూడ్ అనే పదాలకు నిర్వచనం బ్రూటస్ అసాధారణ వ్యక్తిత్వం. అతని ఐడియలిజమ్‌ను ఆరాధించకుండా ఉండలేరు ఎవరూ. ఆఖరికిఅతనిశత్రువులంటోనీకూడా మహోన్నతమైన మాటలతో జోహారు లర్పిస్తాడు బ్రూటస్‌కి. షేక్స్పియర్ బ్రూటస్‌ని గురించి వ్రాసేటప్పుడు అతి మధురమయిన పదాలని ఉపయోగించాడు. బ్రూటస్

వల్లనే ఆ నాటకానికి పేరుప్రఖ్యాతులు వచ్చాయి' అన్నాను.

'మీరు లిటరేచర్ సబ్జెక్టుగా చదివారా?' కుతూహలంగా ప్రశ్నించింది సరోజ.

'లేదండి' అన్నాను.

'చదివి ఉండవలిసింది ఇంటరెస్టు ఉన్నప్పుడు.'

'సాహిత్యమంటే అభిమానం ఉన్నా, సైన్సు అంటే ఎక్కువ ఇష్టం ఉండేది విద్యార్థిగా ఉన్నప్పుడు.'

కాఫీ బిల్లు చెల్లించడానికి ఆమె ప్రయత్నించినా నేను వీలుపడనివ్వలేదు.

ఆమె నొచ్చుకొని, 'మీకు ఋణగ్రస్తులమై పోతున్నాం' అంది.

'పోనీ, నేను ఏ జన్మలోనో ఋణగ్రస్తుడనయి ఇప్పుడు తీరుస్తున్నా ననుకోండి' అన్నాను.

హాసరేఖలు విరిశాయి.

'మీరు ఏ ప్లేస్‌నైనా చూడాలంటే చెప్పండి. లిఫ్టు ఇస్తాను' అన్నాను.

వాళ్లిద్దరూ మొహమాటపడి చివరకు షోర్ టెంపుల్ చూడలేదన్నారు. అక్కడికి వెళ్లాం.

మహాబలిపురం పేరు ఎలా వచ్చిందని సరోజ, నిర్మల లిద్దరూ వాదనలో పడి చివరికి న న్నడిగారు. అసలు పేరు మామల్లపురమనీ, పల్లవుల ఉన్నత సంస్కారానికి చిహ్నంగా వెలిసిన శిల్ప సౌందర్యమనీ చెప్పాను.

అలల తాకిడికి గుడి శిథిలమయింది కొంత భాగం.

'చూశారా, తెలుగువారి పౌరుషంలా అలలు ఎలా విరిరి పడుతున్నాయో?' అన్నాను.

ఎర్రని కలువపూవులా ఉన్న మోముపై ముంగురులు నాట్యం చేస్తుంటే సరోజ కిలకిలమంది. సత్వగుణం ఆమెలో ప్రకాశిస్తూంది.

నా అడ్రెస్ వాళ్లిద్దరికి ఇచ్చి, ఎప్పుడేనా సహాయం కావలసివస్తే తప్పక కోరవచ్చని చెప్పి సెలవు కోరాను, బయలుదేరుదామని.

'ఫామిలీలోనే ఉంటున్నారా హైదరాబాదులో?' అని అడిగింది.

ఫామిలీ అంటే భార్య అని అర్థం, మన దేశంలో.

బాచిలర్‌నని చెప్పాను.

బయలుదేరుతుంటే కుంభవర్షం అకస్మాత్తుగా కురిసింది, పెనుగాలిని వెంటబెట్టుకొని.

వర్షం వలన వాళ్లిద్దరి దగ్గిరా కోరిన సెలవు ఉపసంహరించుకోవలసి వచ్చింది.

కబుర్లలో పడ్డాం.

సూర్యాస్తమయ సమయానికి వర్షం ఉద్ధతం తగ్గింది.

వాళ్లిద్దరూ బస్సు లేటవుతూందని ఆందోళన చెందటం చూసి,

'చూడండి. ఈ వర్షంలో బస్సు కోసం నిరీక్షించడం కష్టం. మీకు అభ్యంతరం లేకపోతే మద్రాసుదాకా నా కారులో రావచ్చు' అన్నాను.


'మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నామేమోననిపిస్తూంది' అన్నది నిర్మల.

'భలేవారే! నాట్ ఎటాల్' అన్నాను.


వెంటనే బయలుదేరాం మద్రాసుకి.

మద్రాసులో వారు దిగారు, ధన్యవాదాలు చెపుతూ. నేను వారి దగ్గరనుండి సెలవు తీసుకొన్నాను.

హైదరాబాదు వచ్చి ఆఫీసులో ఛార్జి తీసుకొన్నాను. కాని, వెంటనే ఆఫీసు పనిమీద అహ్మదాబాదు వెళ్లవలసి

ఋతుక్రమం ఆలస్యమైతే?
విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవిపిల్సు" వాడండి
'దేవి పిల్సు ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతో కూడిన, లేక ఆగిపోయినబహిష్టకుదేవిపిల్సు బాగుగ గుణమిచ్చును


1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు.
FULL COURSE 28 TABLETS Rs.11/-
HALF COURSE 14 TABLETS Rs.6-50
ప్రతిచోటదొరకును
Mfrs. SEENU & Co., MADRAS-81

పురుషుల అవసరాలు తీరుటకు
ఒకాసా



ఒకాసా పురుషులు సఫలజీవితమును జీవించుటకు శక్తిని యిస్తుంది. అకాలంగ వయస్సు చెల్లడం అరికట్టి, ఆరోగ్యమును మెఱుగు, అన్నిటికంటె ముఖ్యంగ, యౌవన వీర్యమును, సత్తువను తిరిగి యిస్తుంది. లక్షలాది ప్రజలు ప్రపంచమంతటా ఒకాసా, ఆధునిక టానిక్-రెస్టొరెటివ్ బిళ్ళలు ఉపయోగిస్తున్నారు. ఒకాసా బిళ్ళలు పురుషులకు, స్త్రీలకు వేఱు-వేఱుగా లభిస్తాయి.
ఒకాసా-హార్మో-ఫార్మా-లి. లండన్-బెర్లిన్ ఉత్ప
కెమిస్టులందరివద్ద, దొరుకుతాయి: లేక మాకు వ్రాయండి:
OKASA CO. PVT. LTD. P.O. BOX 396, BOMBAY-1.

## వాయిదాల మీద ట్రాన్సిస్టర్



ప్రపంచ ప్రసిద్ధమైన, శక్తివంతమైన 3 బాండ్స్, అఖిల ప్రపంచ 'బెరి - పేపర్' ఇంగ్లీషు మాడెల్ ట్రాన్సిస్టర్, గ్యారంటీతో ఇప్పుడు నెలసరి రు. 5/–ల మీద లభిస్తుంది. వెల రు. 165/–. ప్రతి పల్లెకు, బస్తీకి పంపవచ్చును. దిగువ అడ్రసుకు వ్రాయండి:

**LITZ AGENCIES (WAP),**
***Post Box 1267, DELHI-6.***



# శుభవార్త

*

**డాక్టర్లకు సాధ్యంగాక వదలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను, బలహీనులు బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్ఠు, బొల్లి, కేన్సర్. సంతానము లేనివారుకూడా శ్రీ యోగిగారి కాయకల్ప చికిత్స వల్ల సంపూర్ణ ఫలము బడయగలరు. ఈ చికిత్స వలన దేహములోని వ్యాధులు తొలగిపోవుటయేగాక, నూతన యౌవనము కలుగును. వివరములు కోరువారు పోస్టుఖర్చులకు రు. 2—00 M.O. పంపవలయును.**

## శ్రీ యోగాశ్రమము

పెదవాల్తేరు పోస్టు,
విశాఖపట్టణం — 3.


వచ్చింది. బహుశా ఒక నెల అహ్మదాబాదులో ఉండాలి. మరునాటి ప్రయాణానికి అతి కష్టంమీద రైల్వే రిజర్వేషన్ దొరికింది. శాస్త్రిగారి ఇంటికి టెలిఫోన్ చేశాను.

ప్రతిమ బదులు పలికింది.

'ఎప్పుడు విజయం చేశారు?' అని అడిగింది.

'ఈవేళేనండి.'

'ఏమిటి విశేషాలు?'

'మా ఊరు వెళ్ళి మద్రాసుమీదుగా తిరిగి వచ్చానండి. హౌ ఆర్ యూ?'

'బాగానే ఉన్నా. మిమ్మల్ని ఒకటడగాలనుకొంటున్నా.''

'అడగండి.'

'మీరు చెప్పిన మాట నిలబెట్టుకోలేదు.'

'ఏ విషయంలో?'

'కళ్యాణి విషయం గురించి ఆ రోజు రెస్టారెంటులో మీతో చెప్పిన మాటలు జ్ఞాపకమున్నాయా? తరవాత మీరు కాదన్నారు.' వాగ్దానాలని ఎన్నడూ తప్పలేదని ఎలా చెప్పను? నిట్టూర్పు విడిచాను. ఏమని చెప్పగలను?

'క్షమించండి' అన్నాను.

'ఫాదర్ వచ్చారు' అంటూ, నేను మాట్లాడుతున్నట్లు శాస్త్రిగారికి చెప్పి, రిసీవర్ ఆయన చేతికిచ్చింది.

'ఎప్పుడు వచ్చావ్, విజయ్?' అని అడిగారు శాస్త్రిగారు.

జవాబు చెప్పి, మరునాడు అహ్మదాబాదు వెళ్ళే సంగతి చెప్పాను.

'విజయ్! శుభవార్తలు. కళ్యాణీ, ప్రతిమల వివాహాలు సెటిల్ అయాయి' అన్నారు.

'కంగ్రాచ్యులేషన్సండీ.'

'మ ళ్ళోసారి ఇక్కడకు రా' అన్నారు. సరేనన్నాను.

ఆయన ఇంటికి వెళ్ళి ఉత్సాహంలో పాలు పంచుకొన్నాను. అయిదు వారాల వ్యవధి ఉంది, ముహూర్తాలకి. రెండు పెళ్ళిళ్ళూ ఒకే రోజున జరుగుతాయన్నారు. పెళ్ళిరోజుకి ముందుగా నేను అహ్మదాబాదునుండి తిరిగివచ్చి, తనకి సహాయపడాలన్నారు. తప్పక వస్తానన్నాను. నా ఇంటినీ, కారునీ ఆయన ఉపయోగించుకోవచ్చని చెప్పాను.

మరునాడు అహ్మదాబాదుకి ప్రయాణమయ్యాను. అహ్మదాబాదు చేరిన వారం రోజుల తరవాత ప్రతిమ దగ్గరనుండి ఉత్తరం వచ్చింది, రిజిస్టర్డ్ పోస్టులో. తను గుచ్చి గుచ్చి అడిగిన తరవాత కళ్యాణి నాతో ఫోనులో చెప్పిన విషయాలు తెలిపితే తను నిశ్చేష్టురాలయినానని, కళ్యాణి, తను రెస్టారెంటులో నాతో చెప్పిన విషయాలు తెలుసుకొని దిగ్భ్రాంతురాలయినదనీ, తామిద్దరూ ఒకరికి తెలియకుండా ఇంకొకరు నన్ను నొప్పించి బాధించినందులకు క్షమించమని, తమ వివాహాలకి వచ్చి ఆశీర్వదించమని కోరింది.

ఆ ఉత్తరం చదువుతున్నప్పుడు నా మనసు మూగపోయింది.

తరవాత పెళ్ళి శుభలేఖలు వచ్చాయి.

వివాహాలకి ఒక రోజు ముందుగా హైదరాబాదు చేరుకున్నాను. శాస్త్రిగారు కొన్ని పనులు నా మీద పెట్టారు.

కళ్యాణి, ప్రతిమల పెళ్ళిళ్ళు ఎంతో వైభవంగా జరిగాయి. వాళ్ళిద్దరూ నాకు పాదాభివందనం చేస్తుంటే వారించాను. కాని, వారు వినలేదు.

వారి కెప్పుడూ శుభం కూర్చమని నా అంతరంగం భగవంతునికి ప్రార్థన చేసుకొంది.

ప్రతిమ భర్తతో వెళ్ళిపోయింది. కళ్యాణి ఎగ్జామినేషన్స్ వలన హైదరాబాదులో ఉండిపోవలసి వచ్చింది.

పెళ్ళివారికి వీడ్కోలు చెప్పి, శాస్త్రిగారితో రైల్వే స్టేషన్‌నుండి తిరిగి వస్తున్నాం. కారు ముందు పోతూన్న లారీలో పొడుగుపాటి ఊచలు ఉన్నాయి. అకస్మాత్తుగా కుడివైపు రోడ్డుమీదికి తిరిగిన లారీ ఆగింది. వెనక కారులో ఉన్న నేను బ్రేకు వేశాను. అప్పటికే నా కుడిభుజంమీద బలంగా దెబ్బ తగిలింది లారీలోని ఊచలవలన.

స్పృహ వచ్చిన తరవాత చూస్తే శాస్త్రిగారి ఇంట్లో బెడ్‌మీద ఉన్నాను. కుడిభుజంమీద బాండేజి.

జరిగిన విషయాలు గుర్తుకి తెచ్చుకొంటున్నాను.

కళ్యాణి ఇంజక్షన్ ఇస్తూంది.

నవవధువుచేత సపర్యలు చేయించుకొంటున్నానా అని కలతచెందాను.

ఇంతలో శాస్త్రిగారు వచ్చారు:

'విజయ్! అదృష్టవంతులం. కొద్దిలో ప్రమాదం తప్పింది. ఎలా ఉంది?' అన్నారు.

'ఫర్వాలేదండి' అన్నాను.

కళకళలాడే పెళ్ళివారింట్లో పేషెంటుగా ఉండడం నా కిష్టం లేకపోయింది. అక్కడినుండి నా ఇంటికి వెళ్ళిపోతానన్నాను.

ఆయన విస్మయం పొంది, 'పోనీ, నీ డాక్టరెవరో చెప్పు, పిలిపిస్తాను' అన్నారు.

కళ్యాణి దూరంగా చూస్తూంది.

శాస్త్రిగారి కేసి చూస్తూ, 'మీరే' అన్నాను.

'అయితే మాట్లాడకు. సాయంత్రం నీవు ఒక్కడివి తిరగవచ్చు కావలసివస్తే.' వాత్సల్యపూరితంగా అని వెళ్ళిపోయారు, హాస్పిటలుకు.

కళ్యాణి కాఫీ తెచ్చి ఇచ్చింది.

'మిమ్మల్ని మే మనేక విధాల బాధించాం. మన్నించండి'' అని కళ్యాణి అంది.

'నో నో. నాట్ ఎటాల్. మీ కుటుంబ సభ్యుడిగా ఆదరించారు. ఇంతమంచి కుటుంబంతో పరిచయం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. సరే, మీ శ్రీవారు ఏమంటున్నారు? పొద్దున్నగా ఆయన వెళ్ళారు. మరి మీరు ఉత్తరం వ్రాశారా, లేదా?' అని నవ్వుతూ అడిగాను.

'పొండి' అంటూ ఆమె చిరునవ్వుతో, సిగ్గుతో అరుణవర్ణం దాల్చిన తన ముఖాన్ని చేతులలో దాచుకొని లోపలికి తుర్రుమని పారిపోయింది.

నవ్వుకున్నాను.

అతి కష్టంమీద శాస్త్రిగారిని నేను బాగానే ఉన్నానని కన్విన్స్ చేసి ఇంటికి వచ్చేశాను, ఆ సాయంత్రం.

కాలెండరు మారింది. మరొక కొత్త సంవత్సరం వచ్చింది. పెళ్ళి గురించి పేరెంట్సు ఒత్తిడి ఎక్కువయింది. నీ మనసులో ఎవరైనా ఉన్నారా అని ఉత్తరం వ్రాశారు. ఎవరూ లేరన్నాను.

దూరంగా కనుపిస్తూ, షాపింగ్ చేస్తున్న సరోజను చూడడం తటస్థించింది ఒకసారి.

మరొకసారి సరోజ ఇల్లు ఉన్న రోడ్డుమీదుగా

వెళ్లవలసి వచ్చినప్పుడు ఆమె జ్ఞాపకానికి వచ్చింది.

అయితే నా అంతట నేను ఆమెను కలవడానికి ప్రయత్నించలేదు, విపరీతార్థాలకి ఏమాత్రం తావివ్వ కూడదని.

పురుషుడు తనతో ఎవరు మాట్లాడినా అన్యథా తలపోయడు. కాని, స్త్రీ విషయంలో అలా కాదు.

సరోజకి నా అడ్రెసు తెలుసు. టెలిఫోను నంబరు తెలుసు. ఆమె కోరితే మంచి స్నేహితుడుగా ఉంటాను.

నా అంతట నేను స్నేహాన్ని అవతలివారి మీద రుద్దను.

ఇంకొకరి కరుణాకటాక్ష వీక్షణాల కోసం ప్రాకు లాడను.

స్నేహం ఇద్దరు వ్యక్తులమీద ఆధారపడి ఉంటుంది.

అభిమానం, ఆప్యాయతలతో అలరించే స్వచ్ఛమైన స్నేహాన్ని వినమ్రుడనై మన్నిస్తా. కాని, ఇతరుల అహంకారపు ఛాయలు నా ఆత్మ గౌరవాన్ని స్పృశించినా సహించను.

మన్నితంగా, మనోహరంగా కాలచక్రం తిరుగుతూంది.

'వీక్లీ'లో 'న్యూలీ వెడ్స్' అని నిర్మల, ఆమె భర్త ఫొటో చూశాను. వీలైనప్పుడు శుభాకాంక్షలు తెలియ చేయాలనుకొన్నాను.

ఒక రోజు బాంకులో డబ్బు విత్‌డ్రా చెయ్యడానికి వెళ్లాను. ట్రాన్‌శాక్షన్ టైము అయిపోతూంది. హడావిడిగా చెక్కు వ్రాసి కౌంటర్‌లో ఇచ్చాను. టోకెన్ కోసం నిలబడి కౌంటర్‌లోకి చూశాను. ఆశ్చర్యం!

నా పేరు చూసి, తల పైకెత్తి, నన్ను చూసి ఆశ్చర్యపడింది ఆమె.

'మీరు. . . మిసెస్ నిర్మలగారు. . .' అన్నాను.

ఆమె చిరునవ్వుతో తల ఊపి, 'నమస్తే' అంది.

'నమస్కారం. జ్ఞాపకమున్నానా?'

'భలేవారే!'

'బాగున్నారా?' అని అడిగా. ఆమె తల ఊపుతూ టోకెన్ ఇచ్చి, 'లౌంజ్‌లో కూర్చోండి. వస్తాను' అన్నది. సరే నన్నాను.

లౌంజ్‌లోకి వచ్చింది ఆమె. ఎంతో నిర్మలంగా, గంభీరంగా, హుందాగా కనిపిస్తున్నది నిర్మల.

'హార్టీ కంగ్రాచ్యులేషన్స్. మీ పెళ్లి ఫొటో వీక్లీలో చూశాను' అన్నాను.

'థాంక్సండి. పెళ్లి వ్యవధి లేకుండా జరిగింది. అందుచేత ఇన్విటేషను పంపలేకపోయాను మీకు. వెరీ సారీ!'

'ఓ. మరేం ఫర్వాలేదండి. మీ శ్రీవారెక్కడ ఉన్నారు?' అని అడిగాను చిరునవ్వుతో.

'ఈ ఊళ్లోనే పనిచేస్తున్నారండి. మా ఇంటికొకసారి రండి. ఆయనను పరిచయం చేస్తాను' అని అడ్రెసు చెప్పింది.

'హౌ ఈజ్ సరోజ? ఆమెకు గుర్తున్నానా?' అప్రయత్నంగా అడిగాను.

'బాగానే ఉందండి. మీరు బాగానే గుర్తున్నారు.' చెప్పింది.

'ఆమెకు పెళ్లి చేయాలనుకుంటున్నారు వాళ్లింట్లో' అని మళ్లీ అంది.

నేను చిరునవ్వు నవ్వాను.

'మీ వివాహం అయిందా?' ఆమె నవ్వుతూ ప్రశ్నించింది.

'లేదండి' అన్నాను సిగ్గుపడుతూ.

'ఏం? ఎవరినైనా ప్రేమించారా?' హాస్యంగా అన్నది.

అన్నని చెల్లెలు సహజంగా అడిగినట్లు అనిపించింది.

'నో నో. అలాంటి దేమి లేదండి' అన్నాను.

లేచి నించుంటూ, 'సరోజకి నా శుభాకాంక్షలు అందచెయ్యండి' అన్నాను.

'సరోజకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు వాళ్లింట్లో. ఒక సంబంధం కుదిరేలా ఉంది' అన్నది ఆమె.

'ఈజ్ ఇట్?' అన్నాను చిరునవ్వుతో.

'సరోజని మీరు చేసుకోవలసింది' అని ఆమె అన్నది.

నా తలపై తిరుగుతున్న ఫాన్ నా మీద పడ్డట్లయింది. నా కాళ్లకింద భూమి విచ్చుకున్నట్లయింది. నా బాలెన్సు తప్పినట్లయింది. నా లోని భావాలన్నిటిని ముద్ద చేసి, నా తలమీద కొట్టినట్లయింది. నేను తలక్రిందు లవుతున్న ట్లనిపించింది. ఆ క్షణంలో ఎలా ఉక్కిరి బిక్కిరయి తికమకపడ్డానో, సతమత మయానో చెప్పలేను. షాక్ తగిలినట్లయింది. నా ముఖం మీద ప్రశాంతత తొలగిపోయి ఉండాలి. బహుశా తెల్లబడి ఉండాలి.

'ఆ ఏమన్నారు?' నన్ను నేను నిభాయించుకొంటూ, నిలదొక్కుకుంటూ అడిగా. ఎడం చెయ్యి నా షర్టు కాలరుకి సమీపంగా వచ్చింది.

'అంతకన్నా ఆడవాళ్లం మేం ఏం చెప్పగలం?'

నేను ఆశ్చర్యలోకాలనుండి తేరుకుంటున్నాను.

కాష్ కౌంటరునుండి నా టోకెన్ నంబరుని పిలుస్తున్నారు. ఆమె లోపలికి వెళ్లడానికి ఉద్యుక్తురాలయింది.

'వస్తానండి. సరోజని అడిగానని చెప్పండి' అంటూ కాష్ తీసుకుని, గిరుక్కున వెనుతిరిగి బయటికి నడిచాను.

నా బూట్ల టకటక ఎంతోసేపు వినిపించినట్లయింది.

నా పై ముడి ఎడం చేతిలో చిక్కుకుంది.

'ఏం చెయ్యాలి, ఏం చెయ్యగలను?' అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

పబ్లిక్ పరీక్షలో ఒక్క ప్రశ్నైనా అర్థంకాని విద్యార్థి పరిస్థితిలా ఉంది నా మనఃస్థితి.

ఆ రోజున కళ్యాణి ప్రతిమను గురించి ఫోన్‌లో చెప్పినప్పుడు ఇలాగే సతమతమవబోయాను. కాని, అదే రోజున ప్రతిమని కలుసుకున్న తరవాత ఆ సమస్య మాయమయింది.

నాలో ఆత్మవిమర్శ పెల్లుబికింది.

అంతర్ముఖుడనై నన్ను నేను పరిశోధించుకొన్నాను.

నా లోని అంతస్సంఘర్షణ తీవ్రత పెచ్చుమీరింది.

అంతరాత్మ అపసవ్యంగా చేసిన ఘోష, వికట్టాట్ట హాసంలా కలిసి వేసింది.

'సుకుమార హృదయం కాదా నీది? ప్రేమభావం గుర్తించలేవా? ఒక కోమల హృదయపు ఆశల సౌధాలకి ఆలంబన ఇవ్వలేవా? ఒక బేల, లేతమనసు ఆలపిస్తున్న అనురాగ పల్లవి వినలేవా? అహంకారివా?' అని ఆవేదనతో నిండిన అంతరంగం వేసిన ప్రశ్నల పరంపర నా చుట్టూ పరిభ్రమించింది.

సరోజ తన ఊహలకి నేను ఆశ్చర్యం సూచించావని నిర్మలద్వారా తెలుసుకొని, తన ఆత్మగౌరవ భంగంగా తలపోయవచ్చనే ఊహని భరించలేకపోయాను. ఆమె మనసుకి ఆఘాతం కలిగిందేమో నన్న తలంపుతో


యువతీ యువకుల ఆనందానికి, అంతరంగిక సమస్యాపరిష్కారానికి, అనుభవానికి, లైంగిక విజ్ఞానానికి ఎల్లప్పుడూ

**అంబడిపూడి పుస్తకాలనే చదవండి**

మీ ఊళ్లో న్యూస్ ఏజంటును అడగండి. లేదా 10/- రూ. పంపుతూ మాకు వ్రాయండి పంపుతాము.

**జలజ ప్రచురణలు,**

విజయనగరం-3.



## ఇప్పుడే వెలువడింది!

**లివరు, పేంక్రియస్, స్ప్లీను**

వ్యాధులు వాటి చికిత్స - రు. 8/-

రచన: డాక్టరు గాలి బాలసుందరరావు

పై గ్రంథకర్తచే రచింపబడిన యితర వైజ్ఞానిక వైద్య గ్రంథములు:

| | |
|---|---|
| 1. శరీర ధర్మకాండ | రు. |
| (ద్వితీయముద్రణ అచ్చులో ఉన్నది) | 12—00 |
| 2. రోగ కాండ (ద్వితీయ ముద్రణ) | 6—00 |
| 3. ఔషధకాండ — 1 వ భాగం | |
| (ద్వితీయ ముద్రణ) | 7—00 |
| 4. ఔషధకాండ — 2 వ భాగము | 8—00 |
| 5. „ 3 „ | 5—00 |
| 6. క్రిమిదోషములు-నివారణ-నిరోధము | |
| „ 1 వ భాగము | 10—00 |
| 7. „ 2 వ భాగము | 10—00 |
| 8. జీర్ణకోశ వ్యాధులు | 10—00 |
| నాటకములు: | |
| సత్యాగ్రహి (సాంఘిక నాటకము) | 2—00 |
| అపోహ „ | 2—00 |
| అవీ-యివీ(కథలు, వ్యాసములు పద్యములు) | 4—00 |

ప్రచురణ సోల్ డిస్ట్రిబ్యూటర్సు:

మధురా పబ్లికేషన్స్,

88, సర్ త్యాగరాయ రోడ్డు, మద్రాసు-17.

వైద్య గ్రంథములన్నీ ఒకే మారు కొనువారికి రు. 60 లకే లభించును. ఏ నాలుగు పుస్తకములు ఒకే మారు కొన్న పోస్టేజి ఉచితము. ఈ సదుపాయములు కోరువారు, ఆర్డరుతో రు. 5/-లకు తక్కువ లేకుండా అడ్వాన్సు పంపుతూ మధురా పబ్లికేషన్స్ వారికే వ్రాయవలెను.

పై గ్రంథములు (1) నవజీవన్ బుక్‌లింక్సు ఏలూరు రోడ్డు విజయవాడ—2 (2) ఆంధ్ర ప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాదు, ఆం.ప్ర. వద్ద కూడా లభించును.

మీ అభిమాన రచయిత్రి వాచస్పతి గారి

అంతస్తులూ - (సీరియల్)
అంతఃకరణలూ — 5.00
మారినకాలం -
మారనిమనుషులు 4.00
జీవని ... 4.00
స్వీకారం ... 3.50
కౌగితంపూలు ... 3.00
జ్ఞాననేత్రం ... 2.50

శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మగారి
నా డైరీలో ఒక పేజీ 1.50

అశ్వర్థ గారి
నేటి ఆనందం
రేపటి దుఃఖం 5.00

కవిసమ్రాట్: విశ్వనాథ సత్యనారాయణ గారి
విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు 4.00
గంగూలి ప్రేమకథ .. 4.00

ప్రసిద్ధ రచయిత్రి
శ్రీమతి ఆరెకపూడి (కోడూరి)
కౌసల్యాదేవి గారి

పెళ్ళి ఎవరికి ..... 5.00
తేయని శాపం.....5.00
అనిర్వచనీయం 4.00
కల్పన .... 4.00
చక్రభ్రమణం ...5.00
రూ 5.00 లకు మించి కొను వారు ముందుగా డబ్బు M.O ద్వారా పంపిన పోస్టేజి ఉచితం
వి.పి. పద్ధతి లేదు
సర్వోదయ పబ్లిషర్స్
విజయవాడ.2 ఫోన్ 4645

మీ అభిమాన రచయిత
హరికిషన్ గారి
ఈడొచ్చిన కోరికలు 5.00
హృదయకుసుమాలు 5.00
పసిడి మనసులు... 6.00
లోకం పోకడ .... 5.00
మనసులు మారాయి
గగనకుసుమాలు.... 3.50
ఆంధ్రలో అత్తలు... 3.50
పన్నీటి జల్లు...... 3.00
సుమంగళి ... 1.50
మల్లెపూలు-మంచిగంధం 5.00
హరికిషన్ & నండూరు సుబ్బారావు
మన సీనయ్య సంసారం 3.00
A.I.R నండూరు వారి హాస్యనవల

గొల్లపూడి మారుతీరావు గారి
రోమన్ హాలిడే ...3.50
సుక్కాంకరగారి రామశాస్త్రి...1.25


నా హృదయం ముల్లు గుచ్చుకొన్నట్లు విలవిలలాడింది. నా మనసు కరిగి నీరై పోయింది.

సరోజ రూపం గుర్తు లేదు. ఊహించగలను. ఆమెతోటి పరిచయ జ్ఞాపకాలు కళ్ళముందు నాట్యం చేస్తున్నాయి, స్మృతి తాళం వేస్తుంటే.

నా హృదయస్పందన సవ్వడిలో అస్పష్టమైన అపస్వరాల అపశ్రుతి వినిపించింది.

అశాంతి నా హృదయపు లోతులను స్పృశించింది. చివరకు సరోజను కలుసుకొని మాట్లాడడం పరిష్కార మార్గ మనుకొన్నాను. విధి నన్ను పరీక్షకు నిలబెడుతూందనిపించింది.

రెండు రోజుల తరవాత నిర్మలకి ఫోన్ చేశాను. నిర్లిప్తంగా జవాబిచ్చింది. 'ఒకసారి సరోజను కలుసుకొని మాట్లాడాలని ఆమెకు చెప్పండి' అని నా ఫోన్ నంబరు చెప్పాను. నిర్మల సరేనంది.

ఒక వారం గడిచింది. నిర్మలకి ఫోన్ చేసి అడిగాను, సరోజ జవాబు గురించి. ఆమె—'సరోజ నవ్వి ఊరుకుంది' అని చెప్పింది.

నాలో కోపం, జాలీ— రెండూ కలిగాయి.

ఇంకొక వారం రోజుల తరవాత ఆ క్రితం రోజు నేను లేనప్పుడు ఎవరో ఒక స్త్రీ నా కోసం టెలిఫోన్ చేసినట్లు, అడిగినా పేరు చెప్పలేదని చెప్పింది ఆపరేటర్.

రెండు రోజుల తరవాత లోకల్ పోస్టులో ఒక ఇన్‌లాండ్ కవరు వచ్చింది నా పేరున.

అందులో—''హృదయం లేని వ్యక్తులను ఆరాధించడం పొరపాటని తెలుసుకొన్నాను. మమతలు తెలియవు మీకు. స్త్రీ హృదయాన్ని అర్థం చేసుకోలేరు' అని ఉంది. సంతకం లేదు. పేరు లేదు. దస్తూరీ పోల్చ లేకుండా ఉండేటట్లు అక్షరాలు పట్టి పట్టి ప్రింటింగ్ లెటర్సులా వ్రాయబడి ఉన్నాయి.

ఈ ఉత్తరం చదివి నిశ్చేష్టుడి నయ్యాను. నాలో అగ్నిపర్వతాన్ని ప్రతిష్ఠించినట్లయింది.

వేదన, అలజడుల ఉప్పెనలు నన్ను ముంచాయి.

నా ప్రతిబింబపు నీడ క్షోభతో ఊగిసలాడింది.

ఏ విషయంలో ఎలాంటి విజయం కోసం అన్వేషించాలి? హేతువాదంతో పరిశీలిస్తే సమస్యే లేదు. కాని మనసు, మానవత హేతువాదాన్ని లెక్కచెయ్యవు.

మమత మళ్ళీ పూర్వపు సమస్యని నాలో ప్రవేశ పెట్టింది.

ఇంకొకరి హృదయంలో ఏర్పడ్డ అశాంతిని గుర్తించిన తపన నాలో విస్ఫుటమయింది.

ఈ అశాంతి నన్ను జీవితాంతం నీడలా వెంటాడ ప్రయత్నిస్తుంది.

పరిస్థితి అస్తవ్యస్తంగా, అగమ్యగోచరంగా ఉంది.


మమత నేసిన వలలో బందీనయ్యేలా ఉన్నా ననిపించింది. ఆర్ద్రతలో ముంచిన చందన శీతల ఆరాధన, అర్చన నివాళులు ఆలపించిన మనోజ్ఞ మంగళగీతం నన్ను శాసించింది. అనురాగం జలపాతం అయింది.

నా ఆలోచనలు డోలాయమానం అయ్యాయి.

ఏది గమ్యం, ఏది మృదువర్తన?

చివరకు సరోజకు పరిచయాన్ని జ్ఞాపకం చేస్తూ, ఆమె సరళభావాలని ప్రశంసిస్తూ, నా అనురాగాన్ని తెలుపుతూ, *'సుందరమయిన రూపమేకాక అతి సుందర* మయిన మనసుగల మీరు వీణాతంత్రుల మధుర రవళిలో పరవశం పొందాలని నిండుమనస్సుతో కోరుతున్నా'ననీ, 'నా వలన ఎప్పుడైనా సరే, ఎలాటి సహాయమయినా సరే అధికారంతో కోరవచ్చునీ, తనని కలుసుకొని




మాట్లాడడానికి ఎలా ప్రయత్నించానో తెలుపుతూ ఉత్తరం ముగించాను, శుభాకాంక్షలతో.

కాని, నా ఆత్మగౌరవం ఈ ఉత్తరం పంపవద్దన్నది. మనసు ఈ ఉత్తరం పంపక తప్పదంది.

ఉచితమా? అనుచితమా?

ఏది ఏమైనాసరే అని నేను అపురూపంగా కాపాడుకొంటున్న ప్రతిష్ఠ, ఆత్మగౌరవాలను పణమొడ్డి, ఏ ఆశలు లేకుండా ఈ ఉత్తరం సరోజకు అందించమని నిర్మలను కోరాను. ఆమె సరేనని ఉత్తరం తీసుకొంది.

చేయగలిగినది చేశాననే తృప్తితో వేదన అదృశ్యమయింది. ప్రశాంతత లభ్యమయింది.

ఆ రాత్రి శాంతంగా నిద్రపోయాను.

సముద్రపు కెరటాలలో తేలియాడుతున్నది నా నావ, కారుమేఘాల చీకటిలో. దూరంగా కనుపిస్తున్న రమణీయమైన కాంతిరేఖ నా గమ్యమని సముద్రపు ఘోష పదేపదే చెప్పింది. ఈ ప్రయాణం ఎప్పుడు ఏమవుతుందోనని ఆందోళన చెందాను. ఈ గమ్యమేమిటా అని నిరీక్షించాను.

ఆ జీవనజ్యోతి మిలమిలా మెరుస్తూ స్వాగతగీతపు సంగీతం ఆలపిస్తోంది. సమీపించింది నా పడవ. సముద్రపు కెరటాలు ఉవ్వెత్తున లేచాయి. పడవ పక్కలకే వెళుతుందేమోనని చుక్కానిని గట్టిగా పట్టుకున్నాయి నా చేతులు. ఉన్నతమైన ఆ జ్యోతి దగ్గరకు ఒక కెరటంపై లేచిపోవాలి పడవ. సముద్రుడు కరుణించినట్లయింది. ఒక కెరటం ఉవ్వెత్తున లేచింది. కాని, అదృశ్యహస్తం అడ్డు వచ్చింది. శరవేగంతో వచ్చిన గాలి పడవను పక్కకు నెట్టింది. దురదృష్టానికి విచారిస్తూ, మళ్లీ అవకాశం కోసం ఎదురు చూశాను. ఇంకో కెరటం వస్తోంది.

నా పడవ ఎగిరి పడింది. ఎదురుచూస్తున్న కాంతిరేఖని సమీపించాను. హృదయఘోషలో సముద్రపు ఘోష వినిపించలేదు.

నుదుటిమీద బలంగా ఏదో కొట్టుకుంది. కళ్లు తెరిచాను. ఏదో కాంతి ప్రసాదించే జ్యోతి? వెలుగు అదృశ్యమయిందా? వెలుగు దగ్గరకే కదా వస్తే?

నుదురు చిట్లింది. రక్తం కారుతూంది. రక్తబిందువులు కన్నీటితో కలిసి ధారావాహినులై సముద్రంలో కలుస్తున్నాయి. నా పడవలోకి తిరిగి పడ్డాను. కెరటాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. పడవ ఇష్టం వచ్చినట్లు నడుస్తోంది. కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఏమీ కనిపించడం లేదు. చీకట్లో తడుముకొంటున్నాను. ఎందుకో తెలియదు. గమ్యం తెలియదు; దిక్కులు తెలియవు.

ప్రకృతి విషాదగీతం ఆలపిస్తోంది.

ఏమిటి, అంతా భ్రమేనా?

కాని, రక్తసిక్తమైన నా ముఖం, కన్నులనుండి వెలువడే వెచ్చటి అశ్రువులు ఏమిటి? ఏమో!

దూరంగా చంద్రుడు మేఘాలతో దోబూచులాడుతున్నాడు. చంద్రుడి దగ్గరకు ఎలా వెళ్లగలను? చంద్రప్రతిబింబాన్ని సముద్రంలో చూసి పరవశించెందానా!

ఇద్దరిమధ్యా ఎంత దూరం? మళ్లీ ఎంత దగ్గర!

కారు నిశీధిలో కాంతిరేఖ ఉంటుందా?

నిశ్శబ్దంలోని సంగీతం వినిపిస్తుందా?

మయ సభలోని మరీచిక భ్రమకాదా?

ప్రకృతితో పయనించే పరిమళభరిత పవనాల సువాసనలు నన్ను స్పృశించి, పరవశింపచేసేలోగా సుడిగాలి ధూళి నన్ను ముంచివేసింది.

అంతా చూస్తున్న దూరపుకొండలు అహంభావంతో అపహసించాయి.

అలారం మోగింది. మెలుకువ వచ్చింది. ఇదంతా కలవర స్వప్నమా అని ప్రశ్నించుకొని లేచివచ్చాను.

రోజులు హుందాగా తిరిగాయి.

ఒకనాటి పోస్టులో సరోజ పెళ్లి శుభలేఖ వచ్చింది.

పూర్ణప్రఫుల్లమైన మనసుతో గ్రీటింగ్స్ టెలిగ్రామ్ పంపించాను.

చైతన్యవంతంగా రెండు నెలలు గడిచాయి.

నిర్మల టెలిఫోన్ చేసింది. ఆమె అంది: 'మీ రప్పుడు ఇచ్చిన ఉత్తరం ఆ రోజునే సరోజకిచ్చాను. ఆమె చాలా అఫెండ్ అయింది. మీతో పరిచయం కలగడం తన దురదృష్టమంది. కోపగించుకొంది.'

'ఈజిట్?' అన్నాను.

'అవునండీ' అన్నది ఆమె.

'దట్సాల్‌రైట్' అన్నాను నిబ్బరంగా, మృదువుగా. ఆమె సెలవు తీసుకొని ఫోన్ డిస్‌కనెక్టు చేసింది.

ఏమి టిదంతా?

సంస్కారం సవాలు చేయబడింది! సౌజన్యం అపరాధమయింది!

విధాత విధించిన విస్మారమా?

విరించి వినోదంగా ఆడిన ఈ అంతర్నాటక ప్రహసనం ముగిసింది. అయితే, విధిచే మోసగింపబడ్డాను కాని, ఇతరులని ఎన్నడూ మోసగించలేదని, కలనైనా అటువంటి ఊహలు కలగలేదనే సత్యంతో శాంతిని పొందాను, కోపం, మానసికవ్యథ ఏమాత్రం లేకుండా. . ." అంటూ ముగించాడు విజయ్, గంభీరతతో కూడిన చిరునవ్వుతో.

చలించిపోయాను నేను. విజయ్ అరచేతిని నా చేతులలోకి తీసుకొన్నాను అప్రయత్నంగా.

'యువతుల ఊహలు చంచల కాల్పనిక రచనలా? విధి తన వ్యంగ్య నాటకం రక్తి కట్టడానికి విజయ్‌నే ఎన్నుకొంది. కాని, విజయ్ అజయుడు' అని అనుకొన్నాను. ఆ మాటలే అన్నాను పైకి.

(సమాప్తం)